PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 314 | విజయవాడ, గురువారం 15 జూన్ 2023 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 15 June 2023 | Rs

పట్టాలు తప్పిన గూడ్స్

- తాడి - అనకాపల్లి మధ్య ఘటన
- పలు రైళ్లు రద్దు, ఆలస్యం, రీషెడ్యూల్
- నాలుగు గంటలు ఆలస్యంగా వందేభారత్

ప్రజాశక్తి - అనకాపల్లి, ఎంవిపి.కాలనీ

తాడి - అనకాపల్లి మధ్య రాజుపాలెం రైల్వేగేట్ సమీపంలో బుధవారం ఉదయం అనకాపల్లి వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు మూడు భోగీలు పట్టాలు తప్పి అలాగే దూసుకుపోయింది. దీంతో రెండు కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ దెబ్బతింది. రైల్వే అధికారుల సమాచారం ప్రకారం బుధవారం తెల్లవారుజామున సుమారు 3.35 గంటలకు గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తయ్యే వరకూ సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణలో రైళ్ల రాకపోకలు సాగనున్నాయి.

పలు రైళ్లు రద్దు, ఆలస్యం

దక్షిణ మధ్య రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనతో ట్రాక్ దెబ్బతిన్న కారణంగా విశాఖ నుంచి విజయవాడవైపు వెళ్లాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో ఉదయం 10 గంటలకు ట్రాక్‌ను పునరుద్ధరించారు. ఈ క్రమంలో 20833 విశాఖ - సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా నడిచింది. 22825 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ వీక్లీ సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, 22882 భువనేశ్వర్ - పూణే సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ 6 గంటలు, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ 5 గంటలు, 12841 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ కోరమండల్ సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, 15930 న్యూ టిన్సుకియా - తాంబరం ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా నడిచాయి.

జూన్ 14న 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి సూపర్‌పాస్ట్, 22701 విశాఖపట్నం- విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 12740 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. జూన్ 15న గురువారం 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి సూపర్‌పాస్ట్, 12739 గుంటూరు - విజయవాడ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

మరోపక్క 20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 3 గంటలకు బదులు 7 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరే విధంగా రీషెడ్యూల్ చేశారు. అదేవిధంగా జూన్ 13న గుంటూరు నుంచి బయలుదేరిన రైలు నెంబరు 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలును విజయనగరం వద్ద షార్ట్ టర్మినేట్ చేశారు. 17244 రాయగడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్ రాయగడకు బదులుగా 14న విజయనగరం నుంచి బయలుదేరింది.



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ఇదే..

ప్రైవేటు పాఠశాలల్లో 18,749 ఉచిత సీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 18,749 మంది విద్యార్థులు ఉచితంగా సీట్లు పొందారని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం రెండు దశల్లో 45,372 మంది దరఖాస్తు చేసుకున్నారని, మొదటి దశలో 9,479 మంది, రెండో దశలో 9,270 మంది అడ్మిషన్లు పొందారని తెలిపారు.

'కెజిబివి' పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితా

రాష్ట్రంలో 352 కెజిబివిలలో ఖాళీగా ఉన్న 1,358 పోస్టుల భర్తీకి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 30 వేల మంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాను www.apcfss.kgbv.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే రేపటి లోపు సమర్పించాలని, 19న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

దళితుల గురించి మాట్లాడే హక్కు టిడిపికి లేదు

- మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నపుడు దళితులను అవమానించిన టిడిపికి దళితుల గురించి మాట్లాడే హక్కు లేదని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపి నందిగం సురేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. 'దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా' అని అవమానిస్తే అచ్చెన్నాయుడు బాటుకాలితో తన్నారని, అలాగే వర్ల రామయ్య, చింతమనేని ప్రభాకర్ కూడా అవమానించి మాట్లాడారని అన్నారు. దళితులకు కనీసం క్షమాపణ కూడా చెప్పని టిడిపి ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతున్నాయని సదస్సులు పెడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. 56 వేలమంది డప్పు కళాకారులకు తమ ప్రభుత్వం పింఛన్లు ఇస్తోందన్నారు.

కబాలి నిర్మాత కృష్ణ ప్రసాద్ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు సినీ నిర్మాత కృష్ణ ప్రసాద్ చౌదరిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కస్మత్‌పుర వద్ద డ్రగ్స్ విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 82.75 గ్రాముల కొకైన్, కారు, రూ.2.05 లక్షల నగదు, 4 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శంషాబాద్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. కృష్ణ ప్రసాద్ చౌదరిది ఖమ్మం జిల్లా బోనకల్. బిటెక్ చదివి మహారాష్ట్రలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎరోనాటికల్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఎఇఐటి)లో కొంతకాలం ఆపరేషనల్ డైరెక్టర్‌గా పనిచేశారు. తమిళ్ కబాలి సినిమా దర్శకుడు తన్నుతో ఉన్న పరిచయంతో కృష్ణప్రసాద్ 2016లో సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. 'కబాలి' సినిమా తెలుగు వర్షన్‌కు నిర్మాతగా వ్యవహరించారు.

బిజెపి వ్యాఖ్యలు సరికావు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేదలకు నేరుగా డబ్బులు చెల్లించేలా సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అమలు చేస్తుంటే.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా బాధ్యతారాహిత్యంగా, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడం తగదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులను బిజెపి నాయకులు తమ జేబుల నుంచి తీసి ఇస్తున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్రంలో పరిపాలన రోల్‌మోడల్‌గా వుందని ఒకవైపు కేంద్ర మంత్రులు మాట్లాడుతుంటే.. మరోవైపు అవినీతి వుందని ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ కేవలం చంద్రబాబు కోసమే రాజకీయాలు చేస్తున్నారు తప్ప జనసేన పార్టీని అధికారంలోకి తీసురావడం కోసం కాదని అన్నారు. జనసేన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును ఎన్నికల కమిషన్ రద్దు చేసిందని గుర్తు చేశారు. రాజకీయాల పట్ల పవన్‌కల్యాణ్‌కు చిత్తశుద్ధి లేదని, సినిమా షూటింగ్‌లా వారాహి యాత్రను చేపట్టారని విమర్శించారు.

యాసిడ్ దాడిపై ముమ్మర దర్యాప్తు

- రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్/కొవ్వూరు రూరల్

వివాహితపై యాసిడ్ దాడి ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి. ఏలూరు నగరంలోని గ్జేవిఆర్ నగర్ ఎనిమిదో రోడ్డుకు చెందిన ఎడ్ల ఫ్రాన్సిక స్థానిక డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఆమెకు దెందులూరు ప్రాంతానికి చెందిన ఆంజనేయులుతో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఫ్రాన్సిక తన కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. ప్రతిరోజూలానే మంగళవారం రాత్రి ఆమె విధులు ముగించుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై యాసిడ్ పోశారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని డిఐజి అశోక్‌కుమార్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి సందర్శించారు. నిందితులను పట్టుకోవడం కోసం ఏడుగురు సిఐలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని డిఐజి చెప్పారు. క్లూస్ టీమ్ బుధవారం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు బోడా నాగసతీష్, బి.మోహన్, బూడిద ఉషాకిరణ్ పోలీసులు అరెస్టు చేశారు.

కఠిన చర్యలు : మంత్రి వనిత

మహిళపై యాసిడ్ దాడి చేయడం దురదష్టకరమని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జగనన్న ప్రభుత్వం మహిళలకు భద్రత కల్పించే దిశగా చర్యలు తీసు కుంటున్నా, ఇటువంటి ఘటన జరగడం దురదష్టకరమన్నారు. మహిళల పక్షాన ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఎయులో చెట్ల కూల్చివేతను తీవ్రంగా పరిగణిస్తాం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో చెట్లను కూల్చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. చెట్లను ఎందుకు కూల్చేయాల్సి వచ్చిందో వివరించాలని వర్సిటీని ఆదేశించింది. సంబంధిత అనుమతులు లేకుండా చెట్లను కూల్చేస్తున్నారంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ దాఖలు చేసిన పిల్‌పై తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సహజ సిద్ధమైన కుంటల్ని పూడ్చేస్తున్నారని, మహా వృక్షాల్ని కూల్చేశారని, కోర్టు ఆదేశాల్ని ఖాతరు చేయడం లేదని పిటిషనరు తరపున సీనియర్ అడ్వకేట్ కెఎస్ మూర్తి వాదించారు. వీటికి చెందిన ఫొటోలను హైకోర్టుకు అందజేశారు. ఎయు తరపున న్యాయవాది సాయికుమార్ వాదిస్తూ.. చిన్నపాటి పొదల్ని తొలగించామేగానీ చెట్లను కాదని చెప్పారు. ఫొటోలు చూస్తే చెట్లను కూల్చేసినట్లు ఉందని హైకోర్టు పేర్కొంది. పూర్తి వివరాలను అందజేయాలని ఎయుని ఆదేశించింది.

అవి నామమాత్రపు చర్యలే..

ఓ వ్యక్తి నిర్బంధ వ్యవహారంపై వాస్తవాల్ని విచారించేందుకు వెళ్లిన అడ్వకేట్ కమిషనరును, ఆయనకు సహాయంగా వెళ్లిన కోర్టు సిబ్బంది, ఇతరులపై హిందూపురం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ చేయిచేసుకుంటే అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రెండు ఇంక్రిమెంట్ల కోత విధింపు చిన్న శిక్షేనని చెప్పింది.

ఈ శిక్షను ఉన్నతాధికారులు ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించింది. దీనిపై సమగ్ర వివరాలు నివేదించాలని, ఆ శిక్షను ఎలా సమర్థించుకుంటారో వివరించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. అడ్వకేట్ కమిషనరును, వెంట వెళ్లిన వారిని ఇస్మాయిల్ కొట్టారని జిల్లా జడ్జి ఇచ్చిన నివేదికను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణించి విచారణ చేస్తోంది. ఇస్మాయిల్‌పై చర్యలు చేపట్టినట్లు, డిజిపి చర్యలకు శ్రీకారం చుట్టారని ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. రెండు ఇంక్రిమెంట్ల కోత విధించామని తెలిపారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు తదుపరి విచారణకు కూడా ఇస్మాయిల్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.

వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు భరోసా కేంద్రాల్లో పశుసంవర్ధకశాఖకు సంబంధించి క్లస్టర్ విధానాన్ని ఎత్తివేసి, తక్షణమే వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని ధర్నా చౌక్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థికశాఖ అనుమతిచ్చినా కొత్త రిక్రూట్‌మెంట్లు చేయడం లేదని విమర్శించారు. ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వెటర్నరీ పోస్టు వుంటే ఇప్పుడు ప్రభుత్వం మూడు, నాలుగు రైతు భరోసా కేంద్రాలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసి వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించాలనుకోవడం తగదని విమర్శించారు. ఈ ప్రక్రియ వల్ల పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో డెయిరీ ఒకేషనల్, డిప్లమో చదివిన అభ్యర్థులు 30 వేల మంది సచివాలయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. డెయిరీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు వేలకు వేలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారని, ఇప్పుడు నోటిఫికేషన్ ఇవ్వకుండా జాప్యం చేయడం తగదని అన్నారు. క్లస్టర్ విధానంతో పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రంలో ఖాళీగా వున్న 4,765 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వి శివకుమార్, నాయకులు శివ, వెటర్నరీ అసిస్టెంట్ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.



అలంకార్ చౌరస్తాలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

ఇంకా తేల్చుకోలేదు

మొదటి పేజీ తరువాయి

నిజాయితీపరుడుగా, బాధ్యతగా లేకపోతే కచ్చితంగా ప్రశ్నిస్తానన్నారు. ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా పార్టీని నడుపుతానని తేల్చి చెప్పారు. గెలిచిన ఒక్క సీటూ లాక్కున్నారని, అయినా వైసిపి నాయకులు భయపడుతున్నారని అన్నారు. వచ్చేది క్లాస్ వార్ అంటూ జగన్ అమాయక వ్యక్తిలా నటిస్తున్నారని విమర్శించారు. పార్టీని నడపడానికే తాను సినిమాలు చేస్తున్నానన్నారు. క్లాస్ వార్ ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనించాలని, ఈ రాష్ట్రం కోసం నిలబడే వ్యక్తులు కావాలని బలంగా కోరుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆంధ్రా నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. వారాహి యాత్రపై ఆంక్షలు పెట్టి పోలీసులు అడ్డుకోవాలని చూశారని విమర్శించారు. దోపిడీదారులు, అవినీతిపరులపైనే తన పోరాటమని తెలిపారు.

రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగుతోందని, రాష్ట్రాన్ని దోచుకుతింటూ ప్రజలను దోపిడీ చేస్తూ తనను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. మద్యపాన నిషేధం అమలు చేయలేదని, సిపిఎస్‌ను రద్దు చేయలేదని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తి పన్నును విపరీతంగా పెంచిందని, అభివృద్ధిని పక్కనపెట్టి పన్నుల భారాలు మోపుతోందని విమర్శించారు. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరవయ్యాయన్నారు. కీలక పోస్టులన్నీ ఒకే సామాజిక తరగతికి పరిమితం చేయడం సరికాదని తెలిపారు. అన్ని సామాజిక తరగతులకూ ప్రాధాన్యత ఉండాలన్నారు. అమరావతి ఒక కులానికే చెందినది అనుకుంటే ఆనాడే ఎందుకు వ్యతిరేకించలేదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసిపికి పోలవరం ఎటిఎం లాంటిదని ఆరోపించారు. భవిష్యత్‌లో వైసిపిని ఎదుర్కొనేది జనసేన మాత్రమేనన్నారు. ఎపికి అమరావతే రాజధానిగా ఉంటుందని తెలిపారు. కానీ, మూడు రాజధానులంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నవంబర్ లేదా డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లోకి వచ్చానని, ఒక్కసారి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు.

23 నుంచి 'జగనన్న సురక్ష'

మొదటి పేజీ తరువాయి

సురక్ష కార్యక్రమం గురించి వివరించాలని సిఎం పేర్కొన్నారు. ఏ రకమైన వినతైనా, ఏదైనా పత్రాలకు సంబంధించి కానీ డెత్, ఇన్‌కమ్, మ్యారేజీ సర్టిఫికెట్లకు సంబంధించి, అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా? అన్న దానిపై నిశితంగా పరిశీలించాలన్నారు. ఒక్కరు కూడా సచివాలయంలో మిస్ కాకుండా అన్ని వినతులూ పరిష్కారం కావాలని, మండల స్థాయిలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దారు ఒక టీమ్‌గా, తహశీల్దారు, పంచాయతీరాజ్ ఇఒ కలిసి రెండు టీమ్‌లుగా ఏర్పడతాయన్నారు. ఈ రెండు బృందాలు గ్రామాలకు వెళ్లాలని, సచివాలయానికి వస్తున్న తేదీ వివరాలను ముందే నిర్ణయించి ఆరోజు నాటికి గ్రామంలో ఉన్న క్షేత్ర సిబ్బంది ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తారని, నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటినీ జల్లెడ పడతారన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనరు, సిబ్బంది ఒక టీమ్ గానూ, జోనల్ కమిషనరు, లేదా డిప్యూటీ కమిషనరు, సిబ్బంది మరో టీమ్‌గానూ వార్డుల్లో పర్యటించాలన్నారు. జిల్లా కలెక్టరు వారానికి రెండు గ్రామ, వార్డు సచివాలయాలు, జాయింట్ కలెక్టర్ నాలుగు సచివాలయాలు, కార్యదర్శులు, హెచ్‌ఒడిలు నెలకు కనీసం రెండు సచివాలయాలను సందర్శించాలని సిఎం ఆదేశించారు. ఉపాధిహామీలో ఈ ఏడాది 24 కోట్ల పనిదినాలు కల్పించాలని, ఇందులో 60 శాతం అంటే 14.4 కోట్ల పనిదినాలు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలన్నారు. ప్రతిరోజూ జిల్లాల్లో కనీసం 75 వేల పనిదినాలు కల్పించాలని, పనిచేస్తున్న ప్రాంతాల్లో షెడ్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దన్నారు. కార్మికులకు రోజుకు కనీసం రూ.272 వేతనం వచ్చేలా చూడాలన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌కు సంబంధించిన బిల్లులు పూర్తిగా చెల్లించాలని, వెంటనే పనులు పూర్తి చేయడానికి పూర్తి దృష్టి పెట్టాలని అన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు ఇప్పటి వరకు 3.9 లక్షలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డేగా నిర్వహించాలన్నారు. అధికారులు తప్పనిసరిగా లే అవుట్లలో పర్యటించాలని సిఎం ఆదేశించారు. సిఆర్‌డిఏ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి అన్ని ఏర్పాట్లూ చేయాలని, జులై 8 నుంచి పనులు ప్రారంభించాలన్నారు. ఆప్షన్-3 ఎంపిక చేసుకున్న వారికి వెంటనే ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణం మొదలు కావాలన్నారు. ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లలో ఇప్పటికే 61 వేల ఇళ్లు అందించామని, మరో 89,216 ఇళ్లను ఆగస్టులోగా అందిస్తామన్నారు.

జులై 1నుంచి ఇ-క్రాప్ బుకింగ్ ప్రారంభించాలని, సెప్టెంబరు మొదటి వారానికి పూర్తి చేయాలని, సోషల్ ఆడిట్ పూర్తి చేసి సెప్టెంబరు నెలాఖరులోగా తుది జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు కేవలం 11 నెలలకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, రైతులకు చెప్పాలని అధికారులకు సిఎం సూచించారు. కౌలు రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి విడతలో 17 వేల రెవెన్యూ గ్రామాలకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు పూర్తయిందని, 7.86 లక్షల భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు.

టెంపో బోల్తా : నలుగురు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు (ఏలూరు జిల్లా)

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాతపడ్డారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో బుధవారం జరిగింది. మృతుల కుటుంబికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండల పరిధిలోని తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన 15 మంది భద్రాచలంలో రామయ్యను దర్శించుకునేందుకు టెంపో ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రమాణంలో కిన్నెరసాని వాగు సమీపంలో వారి వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో జట్ల దుర్గారావు (35), పచ్చిపాల శ్రీనివాసరావు (34), సందీప్ (10), ప్రదీప్ (8) మృత్యువాత పడ్డారు. తీవ్ర గాయాల పాలైన నరసింహారావు, తిరుమలరావు, నిర్మల, అనూషను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బూర్గంపాడు ఎస్ఐ సంతోష్ హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుక్కునూరు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు భద్రాచలం ఆసుపత్రికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



కిన్నెరసాని వంతెన కింద పడ్డ టెంపో వాహనం చెల్లాచెదురుగా పడ్డ భక్తులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తెలుగు షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ నాయకులు

సామాజిక రుగ్మతలు, భిన్నత్వంలో ఏకత్వంపై షార్ట్‌ఫిలిమ్‌లకు ప్రోత్సాహకాలు

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులవివక్ష, లైంగిక వేధింపులు, మద్యపానం, ధూమపానం లాంటి సామాజిక రుగ్మతలతోపాటు భిన్నత్వంలో ఏకత్వం లాంటి అంశాలపై రూపొందించిన షార్ట్ ఫిలిమ్‌లకు పోటీలను నిర్వహించి ప్రోత్సాహకాలను అందించనున్నట్లు తెలుగు షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు బుధవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో షార్ట్ ఫిలిమ్ పోటీల బ్రోచర్‌ను తెలుగు షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ అధ్యక్షులు బిఎకెఎన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డివి రాజు, కృష్ణా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ఆనంద్, డాక్టర్ యువరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు, ఐజాక్ న్యూటన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివి రాజు మాట్లాడారు. రాష్ట్రంలో 2017 నుంచి షార్ట్ ఫిలిమ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ ఆన్‌లైన్‌లో నిర్వహించామన్నారు. ఇప్పటిదాకా ఆరు వర్క్‌షాప్‌లను విజయవాడ, విశాఖపట్నంలలో నిర్వహించామన్నారు. కులవివక్ష, లైంగిక వేధింపులు, మద్యపానం, ధూమపానం, భిన్నత్వంలో ఏకత్వం లాంటి అంశాలతో రూపొందించిన షార్ట్ ఫిలిమ్‌లను సెప్టెంబర్ 10వ తేదీలోపు తమకు పంపాలని కోరారు. తమకు అందిన షార్ట్ ఫిలిమ్‌లలో 30 సెలెక్ట్ చేసి ప్రదర్శిస్తామని అన్నారు. అందులో ఐదు ఉత్తమ షార్ట్‌ఫిలిమ్‌లను ఎంపిక చేసి వాటికి ఐదువేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు. మరో ఐదు షార్ట్‌ఫిలిమ్‌లను గుర్తించి వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ఈ ఏడాది నుండి రీల్స్ పోటీలను నిర్వహించి ప్రథమ బహుమతి కింద రూ.3 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.2 వేలు, మూడో బహుమతి కింద వెయ్యి రూపాయలను అందిస్తామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సినీ ప్రముఖులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకుగాను 9391163508 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనరు నీలం సహాని ప్రారంభించారు. వాలంటరీ బ్లడ్ డొనేషన్స్ ఆఫ్ ఎపి, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఈ క్యాంప్‌ను నిర్వహించారు. శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు. ఇందుకు సహకరించిన జి సమరం, రమణారావుకు వాలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జివి సాయి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 201 వైద్య శిబిరాలు : జె నివాస్

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ జె నివాస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 201 వైద్య శిబిరాలు నిర్వహించామని, 6,829 మంది రక్తదానం చేయగా, వీరిలో 1,281 మంది వైద్య సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. 'రక్తం-ప్లాస్మా ఇవ్వండి-జీవితాన్ని తరచుగా పంచుకోండి' అనేదే వరల్డ్ బ్లడ్ డోనర్ డే నినాదమని తెలిపారు.

దయనీయంగా పోలవరం నిర్వాసితులు

మొదటి పేజీ తరువాయి

వస్తువులు, నష్టపరిహారం అందించలేదు. ఈ సంవత్సరం జులై, ఆగస్టు నెలల్లో మరలా వరద వచ్చే ప్రమాదం ఉంది. ముందస్తు చర్యలు తీసుకోవాలి.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 చట్టం సమగ్రంగా అమలు జరిపి పరిహారం, పునరావాసం కల్పించాలని, వరద ప్రాంత మండలాల్లో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని, గతంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, కాంటూరు లెక్కలను శాస్త్రీయంగా రూపొందించాలని తదితర కోర్కెల పరిష్కారం కోసం ఈ మహా పాదయాత్ర జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ చూపించాలని, సకాలంలో పరిష్కారం చేయాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు

- నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకు గ్రామాలు ఖాళీ చేయించరాదు.
- పునరావాసం పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలి.
- 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాల రీసర్వే చేయాలి.
- పునరావాసం దశల వారీగా కాకుండా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి.
- మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్అండ్ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి.
- ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకు 20 లక్షలు చెల్లించాలి.
- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 10.50 లక్షల పరిహారం ఇవ్వాలి. జిఓ నెం. 224 అమలుచేయాలి.
- గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతీ, యువకులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పెళ్లయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలి.
- సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.
- ముంపు ప్రాంతాల ఉద్యోగులందరినీ యథాతథంగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి.
- నిర్వాసితుల కాలనీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.
- ముంపు మండలాల్లో మునిగిపోతున్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కాలనీల్లో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలి.
- నిర్వాసితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి డివిజన్ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలి.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 314 | విజయవాడ, గురువారం 15 జూన్ 2023 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 15 June 2023 | Rs

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

- శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

లోపలి పేజీలో..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ భారీగా పెంపు

- సింగిల్స్ విజేతకు రూ.24.44కోట్లు, మొత్తం రూ.465 కోట్లు



లోపలి పేజీలో..

ఇపి సెట్‌లో బాలికలదే హవా

- టాప్ టెన్‌లో బాలురు
- ఇంజినీరింగ్‌లో 76.32 శాతం
- అగ్రికల్చర్‌లో 89.65 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (ఇఎపిసెట్) ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. ఇందుకు సంబంధించిన ఇఎపిసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో బాలురు కంటే బాలికలు 3.99 శాతం, అగ్రికల్చర్‌లో బాలురు కంటే 0.99 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. అయితే రెండు విభాగాల్లో టాప్ టెన్‌లో బాలురే పైచేయి సాధించారు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మొదటి పది స్థానాలు బాలురే సాధించారు. బాలికలు ఒక్కరు కూడా లేరు. మే 15 నుంచి 19 వరకు జరిగిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,3,180 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,24,724 మంది పరీక్ష రాయగా, 1,71,514 (76.32 శాతం) మంది అర్హత సాధించారు. 92,267 మంది బాలికలు పరీక్ష రాయగా, 72,589 మంది (78.67 శాతం) అర్హత పొందారు. మే 23, 24 తేదీల్లో జరిగిన అగ్రికల్చర్ విభాగం ప్రవేశ పరీక్షకు 1,00,559 మంది దరఖాస్తు చేసుకోగా, 90,573 మంది పరీక్ష రాశారు. వీరిలో 81,203 (89.65 శాతం) మంది అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని చెప్పారు. అందుకనే సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థి ప్రపంచ స్థాయికి ఎదగాలన్నది సిఎం ఆశయమని అన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు వివరాలు ఎఐసిటిఇ నుంచి అనుమతి రావాలని చెప్పారు. కాబట్టి జులై 15 నుంచి ఇఎపిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభించాలని భావిస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన కేసు నాలుగేళ్ల నుంచి కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె రామ్మోహన్‌రావు, కార్యదర్శి నజీర్ అహ్మద్, సెట్ల కన్వీనర్ ఎం సుధీర్ రెడ్డి, ఇఎపిసెట్ ఛైర్మన్ జి రంగా జనార్ధన, కన్వీనరు శోభా బిందు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ టాప్ ర్యాంకర్లు

ర్యాంకు	విద్యార్థి పేరు	మార్కులు
1.	చల్లా ఉమేష్ వరుణ్	158.0313
2.	బిక్కి అభినవ్ చౌదరి	157.2624
3.	నందిపాటి సాయిదుర్గా రెడ్డి	155.2980
4.	చింతపర్తి బాబు సుజన్ రెడ్డి	155.6847
5.	దుగ్గినేని వెంకట యోగేస్	154.6556
6.	అడ్డగడ వెంకట శివరామ్	153.9792
7.	యక్కంటిపాని వెంకట మణీంద్ర రెడ్డి	154.6274
8.	మేడపురం లక్ష్మీనరసింహ మాదవ భరద్వాజ్	153.1448
9	పిన్ను శశాంక్ రెడ్డి	152.8847
10.	ఎం శ్రీకాంత్	152.8447



ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు

అగ్రికల్చర్ టాప్ ర్యాంకర్లు

ర్యాంకు	విద్యార్థి పేరు	మార్కులు
1.	బూరుగుపల్లి సత్యరాజ జశ్వంత్	153.8815
2.	బొర వరుణ్ చక్రవర్తి	151.0651
3.	కొన్ని రాజశేఖరరావు	151.5285
4.	వలేటి సాయి అభినవ్	149.9539
5.	దుర్గెంపూడి కార్తికేయ రెడ్డి	150.0839
6.	రాజేశ్వరి కుచురు	149.8099
7.	తడ్డి సాయి వెంకట యశ్వంత్ నాయుడు	148.9013
8.	గుడిపూడి కీర్తి	147.7060
9.	పొట్నూరు ఆశిష్	148.2190
10	దేరంగుల అభిజిత్ సాయి	147.1587



క్యాంపు కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్‌పిలతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

23 నుంచి 'జగనన్న సురక్ష'

- ప్రతి ఇంటినీ జల్లెడ పట్టాలి
- కలెక్టర్లు, ఎస్‌పిలతో సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఈ నెల 23 నుంచి జులై 23 వరకు నెల రోజులపాటు నిర్వహించాలని అధికారులను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో జగనన్నకు చెబుదాం, గడప గడపకూ మన ప్రభుత్వం, ఉపాధిహామీ పనులు, హౌసింగ్, వ్యవసాయం-సాగునీరు విడుదల, జగనన్న భూ హక్కు - భూ రక్ష కార్యక్రమాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే వినతుల పరిష్కారంలో నాణ్యత అనేది చాలా ముఖ్యమని, గ్రామ సచివాలయాల దగ్గర నుంచి కలెక్టర్లు, ప్రభుత్వ విభాగాల కార్యదర్శులంతా దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, గృహ సారథులు, ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న మిగతా 2లో

తమిళనాడు మంత్రి సెంథిల్ అరెస్టు

- ఛాతిలో నొప్పితో ఆస్పత్రిలో చేరిక
- బైపాస్ సర్జరీ చేయాలన్న డాక్టర్లు
- సిఎం ఎంకె స్టాలిన్ పరామర్శ
- ప్రతిపక్షాల నేతలపై కేంద్రం వేధింపుల పట్ల సర్వత్రా ఆగ్రహం

చెన్నై : మనీలాండరింగ్ కేసులో తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి, డిఎంకె నేత వి సెంథిల్ బాలాజీ అరెస్టయ్యారు. మంత్రి కార్యాలయంలో మంగళవారం నుంచి సోదాలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు దాదాపు 18 గంటల పాటు విచారించారు. అనంతరం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చాతినొప్పికి గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. బైపాస్ సర్జరీ చేయాల్సిన అవసరముందని వైద్యులు ప్రకటించారు. సెంథిల్ ఆసుపత్రిపాలుకావడానికి ఇడి వేధింపులే కారణమని డిఎంకె నేతలు పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల నేతలను సోదాల పేరిట వేధింపులకు గురి చేయడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సెంథిల్ అరెస్టును కాంగ్రెస్ అధ్యక్షులు మిగతా 7లో



మంత్రి సెంథిల్‌ను పరామర్శిస్తున్న స్టాలిన్

ఆయుధంగా మారిన ఇడి



'సెంథిల్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర సచివాలయంలో సోదాలు జరపడం దేనికి సంకేతం? ఎక్కడైనా సోదాలు చేయగలమనే బెదిరింపులకు ఇది సంకేతం కాదా? ప్రతిపక్ష నేతలపై దాడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ను మోడీ ప్రభుత్వం ఒక ఆయుధంగా మార్చుకుంది'

– సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



బుధవారం కత్తిపూడిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం

విడిగానా, ఉమ్మడిగానా ఇంకా తేల్చుకోలేదు

వారాహి యాత్ర ప్రారంభంలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఈసారి ప్రజలు దీవించి అవకాశమిస్తే అవినీతిలేని ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిస్తామని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. విడిగా వస్తానో, ఉమ్మడిగా వస్తానో ఇంకా నిర్ణయించుకోలేదని, ముఖ్యమంత్రి పదవి ఇస్తే సంతోషంగా స్వీకరిస్తానని వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని అన్నవరంలో బుధవారం ఉదయం ఆయన పూజలు చేసి వారాహి యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి ర్యాలీగా కత్తిపూడి చేరుకొని రాత్రి జరిగిన సభలో వారాహి వాహనంపై నుంచి మాట్లాడారు. ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టకుండా తనను ఎవరు ఆపుతారో చూస్తానని సవాల్ విసిరారు. పరిపాలించేవాడు మిగతా 2లో

మళ్లీ ఉమ్మడి పౌర స్మృతి చిచ్చు

- సూచనలు కోరిన లా కమిషన్

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతిపై 22వ లా కమిషన్ ఆఫ్ ఇండియా బుధవారం కొత్తగా సూచనలను కోరింది. ప్రజలు, మత సంస్థలతో సహా వివిధ భాగస్వామ్యుల నుంచి సూచనలను ఆహ్వానించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలోని 21వ లా కమిషన్ కూడా ఈ అంశాన్ని పరిశీలించి, వివిధ భాగస్వామ్యుల నుంచి సూచనలను ఆహ్వానించింది. ఆగష్టు 2018లో 'కుటుంబ చట్టాల సంస్కరణలు'పై ఒక సంప్రదింపు పత్రాన్ని కూడా విడుదల చేసింది. అయితే ఈ అంశం యొక్క ఔచిత్యాన్ని, ప్రాముఖ్యతను, వివిధ కోర్టుల తీర్పులను దృష్టిలో ఉంచుకుని ఈ విషయాన్ని మళ్లీ చర్చకు తీసుకుని వస్తున్నట్లు తాజా లా కమిషన్ తెలిపింది. దేశంలో ప్రస్తుతం ఉమ్మడి పౌర స్మృతి అవసరం లేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిఎస్ చౌహాన్ నేతృత్వంలోని 21వ లా కమిషన్ తెల్చి చెప్పింది. దేశంలో ప్రబలంగా ఉన్న బహుళత్వంతో లౌకికవాదానికి ఎలాంటి ముప్పు లేదని పేర్కొంది. అయినా దాన్ని మళ్లీ మళ్లీ ప్రజల ముందుకు తెచ్చేందుకు, విద్వేషాలు సృష్టించేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తూనే వుంది.



బిపర్‌జోయ్ తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం ముంబయి తీరంలో తాత్కాలిక దుకాణాల వరకూ దూసుకొచ్చిన అలలు

రక్షిత ప్రాంతాలకు 50 వేల మంది తరలింపు

- నేడు తీరం దాటనున్న బిపర్‌జోయ్
- సౌరాష్ట్ర, కచ్‌లో భారీ వర్షాలు, గాలులు

లోపలి పేజీలో..

ఉద్యోగులకు స్పెషల్ పే పెంపు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ పే అలవెన్సులను పెంచుతూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 11వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఈ పెంపు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంది. ఈ ఉత్తర్వులు జులై నుంచి అమలులోకి రానున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లో వారి స్థాయిలను బట్టి ఈ పెంపు చేస్తున్నట్లు తెలిపింది. ఏ స్థాయి వారికి ఎంత పెంచుతున్నామన్నది కూడా ఈ ఉత్తర్వుల్లో వివరాలు సమర్పించింది. శాఖలతోపాటు, ముఖ్యమంత్రి పేషీలో పనిచేస్తున్న వారి వివరాలు కూడా వివరించింది. 11వ ఆర్థిక సంఘం కాలపరిమితి ఈ నెలాఖరుతో పూర్తవుతున్న చివరి తరుణంలో ఈ పెంపు ఉత్తర్వులు రావడం గమనార్హం.

లైవ్‌లో హైకోర్టు విచారణ

- ప్రయోగాత్మకంగా సిజె బెంచ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చరిత్రలో మరో అధ్యాయం మొదలైంది. కేసుల విచారణను తొలిసారి ప్రత్యక్ష ప్రసారం చేశారు. తొలిరోజు బుధవారం హైకోర్టులోని ఒకటో నెంబరు హాలు నుండి యాక్టింగ్ సిజె జస్టిస్ శేషసాయి, రఘునందనరావుతో కూడిన బెంచ్ విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. తొలిరోజు మొత్తం 45 కేసులను విచారించారు. హైకోర్టు చరిత్రలో తొలిసారి కావడంతో న్యాయవాదులు, కక్షిదారులు కూడా ఆసక్తిగా తిలకించారు. ఇక నుంచి కేసుల విచారణను కక్షిదారులు నేరుగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడటానికి వీలు కల్పించారు. ప్రస్తుతం ఒకటో కోర్టులో విచారణ ప్రసారం చేసినా క్రమంగా అన్ని కోర్టులకూ దీన్ని విస్తరించనున్నారు. ఇప్పటికే సుప్రీం కోర్టులోనూ ప్రత్యక్షంగానూ, ఆన్‌లైన్ పద్ధతుల్లోనూ విచారణ సాగుతోంది. కేసుల విచారణ తీరు ప్రతి ఒక్కరికీ తెలియాలని, కోర్టుల్లో ఏం జరుగుతుందో ప్రజలు కూడా తెలుసుకోవాలని గతంలో సుప్రీం కోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ఇచ్చిన ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులోనూ కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం జరిగింది. అదే సమయంలో దేశంలో ఉన్న అన్ని హైకోర్టుల్లోనూ ఇదే తరహా విచారణ జరగాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

మరో 2 రోజులు వడగాడ్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎండ తీవ్రతతోపాటు వడగాడ్పుల ప్రభావం మరో రెండు రోజులు ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న 252 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 16న 268 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. బుధవారం అనకాపల్లి జిల్లా మాడుగులలో 45.3 డిగ్రీలు, విజయనగరం జిల్లా బొబ్బిలిలో 44.9 డిగ్రీలు, మన్యం జిల్లా సాలూరులో 44.5 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం, ఏలూరు జిల్లా పోలవరం, కాకినాడ జిల్లా కోటనందూరులో 44.1 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. 137 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 203 మండలాల్లో వడగాడ్పులు వీచాయన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దయనీయంగా పోలవరం నిర్వాసితులు

- సమస్యలు పరిష్కరించాలని సిఎస్‌కు సిపిఎం రాష్ట్ర కమిటీ వినతి
- 20 నుండి జులై 4 వరకు మహా పాదయాత్ర
- త్వరలో ఉమ్మడి సమావేశం ఏర్పాటుకు సిఎస్ హామీ



సిఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, బుధవారం సిఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన జూన్ 20వ తేదీ నుండి జులై నాలుగోతేదీ వరకూ నిర్వాసితుల మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వాసితుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి స్పందిస్తూ పోలవరం నిర్వాసితుల సమస్యలపై తక్షణమే ప్రభుత్వం తరపున ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుండి మహాపాదయాత్ర ప్రారంభమవుతుంది. వందలాది మందితో అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు విలీన మండలాలను కలుపుతూ జరిగే ఈ యాత్ర ఏలూరు జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రవేశించి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, హనుమాన్‌జంక్షన్, గన్నవరం మీదుగా విజయవాడ వరకు కొనసాగుతుంది. విజయవాడలో జులై 4న మహాధర్నాతో ముగుస్తుంది.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించడం లేదు. నిర్వాసితుల సమస్యలు తీవ్రంగాను, దయనీయంగాను ఉన్నాయి. గత సంవత్సరం వచ్చిన వరదల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు మండలాలు, ఏలూరు జిల్లాలో రెండు మండలాలు వంద రోజులపాటు వరదలో మునిగాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులై నానా అగచాట్లు పడ్డాయి. ప్రభుత్వం సహాయక చర్యలు చేయలేదు. కుటుంబానికి రు.2000 చొప్పున సహాయం తప్ప నిత్యావసర మిగతా 2లో

సంపాదకీయం

దాడుల పరంపర..


మోడీ ప్రభుత్వం వల్లిస్తున్న సహకార ఫెడరలిజం వట్టి బూటకమని ఇప్పటికే తన చేతల్లో రుజువు చేసుకోగా, తాజాగా తమిళనాడులో డిఎంకె మంత్రి వి.సెంథిల్ బాలాజీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) మెరుపుదాడి సమాఖ్య వ్యవస్థపై కేంద్ర బిజెపి సర్కారు జరిపిన మరో ఘాతుకం. ఎప్పుడో ఎఐడిఎంకె ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగ నియామకాల్లో వెల్లడైన ఆరోపణలపై ఇప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థలు కూపీ లాగడం మొదలు పెట్టాయి. రెండు వారాల కింద ఆదాయపన్నుశాఖ (ఐ.టి) అధికారులు ఒక విడత సెంథిల్ బంధువులు, అనుచరుల నివాసాలు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. మంగళవారం ఏకంగా రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో మంత్రి సెంథిల్ కార్యాలయంలో ఇ.డి. సోదాలు నిర్వహించింది. సెంథిల్‌ను గంటల కొలది ప్రశ్నించింది. ఆపై అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసినట్లు ప్రకటించింది. వైద్యపరీక్షల కోసం అస్పత్రికి తరలించే క్రమంలో సెంథిల్‌కు ఛాతినొప్పి రావడంతో ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షల అనంతరం బైపాస్ సర్జరీ అత్యవసరమని వైద్యులు సిఫారసు చేశారు. ఇ.డి. సెంథిల్‌ను అంతలా హింసించిందని డిఎంకె ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర బిజెపి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిరసనగా డిఎంకె శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. సెంథిల్ అరెస్టును ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఖండించారు.

మంత్రి సెంథిల్‌పై ఇ.డి. దర్యాప్తు ముమ్మాటికీ మోడీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో చేపట్టిన వేధింపు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారం తమిళనాడులో పర్యటించగా, తదుపరి రెండు రోజులకే సెంథిల్ అరెస్టు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయాలు తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలుసు. కొంతకాలంగా తమిళనాడులో రాజకీయ పరిణామాలు పరిశీలించిన ఎవరికైనా బిజెపి కుయుక్తులు ఇట్టే అర్థమవుతాయి. జయలలిత అస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనే ఎలాగైనా తమిళనాడులో ఉనికి చాటుకోవాలన్న బిజెపి తాపత్రయం కనిపించింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ఎఐడిఎంకెతో పొత్తు పెట్టుకున్నా బిజెపి ఆశలు నెరవేరకపోగా ఘోర పరాజయంతో తలబొప్పి కట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే పునరావృతమైంది. ఆ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన డిఎంకె కూటమి ప్రభుత్వం కేంద్ర విధానాలను, ముఖ్యంగా రాష్ట్రాల హక్కుల హననాన్ని, సమాఖ్య వ్యవస్థపై దాడిని వ్యతిరేకించి నిలబడింది. సహించలేని మోడీ ప్రభుత్వం గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని ప్రజలెన్నుకున్న డిఎంకె ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతోంది. స్టాలిన్ ప్రభుత్వం కేంద్ర ఆగడాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడంతోపాటు బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల, పార్టీల ఐక్యతకు కృషి చేస్తోంది. గిట్టని బిజెపి ఎలాగైనాసరే డిఎంకె ప్రభుత్వాన్ని అస్థిరపాల్జేయాలన్న కుట్రతోనే ఐ.టి., ఇ.డి. కేసులు బనాయిస్తోంది. ఆ పూర్వరంగంలోనిదే మంత్రి సెంథిల్‌పై ఇ.డి. కేసు. దక్షిణాదిలో ఉన్న ఏకైక కర్ణాటక చేజారాక తమిళనాడుపై బిజెపి మరింతగా గురి పెట్టింది.

మనీలాండరింగ్ వంటి ఆరోపణలపై ఒక రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రం సెక్రటేరియట్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఇ.డి. సర్జికల్ స్ట్రైక్స్ చేయడం మామూలు విషయం కాదు. అలాంటి అధికారాలు కావాలంటున్నారు మోడీ. అదేమీ అవినీతి, అక్రమాలు, నల్లధనం నిరోధించడానికి కాదు. విపక్ష పార్టీలను బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి, లొంగకపోతే ఇబ్బంది పెట్టడానికి. ఢిల్లీలో మద్యం స్కాంలో కేజ్రీవాల్ ప్రభుత్వంలోని మంత్రి సిసోడియా అరెస్ట్ అయినా, తెలంగాణలో కవితపై కేసైనా. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, లల్లుప్రసాద్.. ఏ కేసైనా రాజకీయ ప్రేరేపితమే. మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలలోని కీలక నాయకులే లక్ష్యంగా తన అధీనంలోని ఇ.డి, ఐ.టి, సిబిఐ, ఎన్ఐఎ వంటి సంస్థలను ఉసిగొల్పి దుర్వినియోగం చేస్తోంది. ఈ నెల 23న పాట్నాలో ప్రతిపక్షాల భేటీ జరుగుతున్న వేళ బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్రలు చేస్తోంది. దేశానికి పీడలా తయారైన బిజెపికి ఎదురొడ్డి ఐక్యంగా నిలబడటం ద్వారానే ప్రతిపక్షాలు మనగలుగుతాయి. బిజెపిని ఓడించడానికి అదే మార్గం.

మహనీయుల మాట

నేడు శ్రీశ్రీ వర్ధంతి



ఏదీ తనంత తానే నీ దరికి రాదు.
శోధించి సాధించాలి.
అదే ధీరగుణం.

జననం : 30.4.1910
మరణం : 15.6.1983

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు - ఒక పరిశీలన

విశ్లేషణ



బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పెద్ద ఎత్తున వేగంగా అమలు జరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం చెబుతున్నదల్లా చేస్తున్న వైసిపి ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఇవే విధానాలు అమలు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ కాలంలో 6,16,323 ఉద్యోగాలు కల్పించామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటిస్తోంది. వాటిలో 3,71,777 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కాగా 37,908 కాంట్రాక్ట్ ఉద్యోగాలు. మిగిలిన 2,06,638 రెగ్యులర్ ఉద్యోగాలని చెబుతున్నారు. వీరిలో 1,25,110 మంది గ్రామ / వార్డు సచివాలయ ఉద్యోగులు. 51,387 మంది ఆర్‌టిసి ఉద్యోగులు.

రాష్ట్ర అధికారిక లెక్క ప్రకారం 10,98,012 ఉద్యోగులు ఉండగా 2,61,311 మంది పాత పెన్షన్ విధానం అమలయ్యే రెగ్యులర్ ఉద్యోగులు. 3,08,984 మంది సిపిఎస్ ఉద్యోగులు. మిగిలిన 5,27,717 మంది ఏ పెన్షన్ లేని వారు. అంటే సుమారు 48 శాతం మంది ఉద్యోగులు ఏ భద్రత లేనివారు, మరొక 28.2 శాతం ఉద్యోగులు అరకొర భద్రత కలిగినవారు. పూర్తి భద్రత కలిగిన ఉద్యోగుల సంఖ్య 23.8 శాతం మాత్రమే.



కె.ఎస్.ఎస్.ప్రసాద్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జాబ్ క్యాలండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తామని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తానని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని, 27 శాతం ఐ.ఆర్ ప్రకటించి దానికంటే మేలైన వేతన సవరణ అమలు చేస్తానని, డిఎలు రెగ్యులర్‌గా సకాలంలో చెల్లిస్తానని అనేక వాగ్దానాలు చేశారు. కాని, ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. గ్రామ / వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు మినహా మరే కొత్త ఉద్యోగాలు సృష్టించలేదు సరికదా ఉన్న రెగ్యులర్ ఖాళీలేవీ భర్తీ చేయలేదు.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల జెఏసిలు సమస్యలపై పోరాటం ప్రారంభించాయి. మరోవైపు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు కూడా సమస్యలపై కార్యాచరణకు పిలుపునిచ్చాయి. పరిస్థితులు వ్యతిరేకంగా మారుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కొన్ని నిర్ణయాలు వెల్లడించింది. చర్చకు పెద్దగా అవకాశమివ్వకుండా వాటినే జూన్ 7వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినట్లుగా ప్రకటించారు.

మంత్రివర్గ నిర్ణయాలలో అతి ముఖ్యమైనది పెన్షన్ సమస్య. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 4 సంవత్సరాలు గడిచినా హామీ నిలుపుకోకపోవడంతో సిపిఎస్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గం సిపిఎస్ రద్దు చేస్తున్నట్లు, దాని స్థానంలో "గ్యారంటీ పెన్షన్ స్కీమ్" (జిపిఎస్) అమలు చేయనున్నట్లు ప్రకటించింది. మూల వేతనంలో 50 శాతం పెన్షన్‌గా ఇస్తామని, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డియర్‌నెస్ రిలీఫ్ కూడా ఇస్తామని చెబుతున్నది.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తే 2041 నాటికి 65,234 కోట్లు పెన్షన్లకే చెల్లించాల్సి వస్తుందని, 2070 నాటికి అది 3,73,000 కోట్లకు చేరుతుందని లెక్కలు చూపుతున్నారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై మోయలేని భారం పడుతుందని, అందుకే ఉభయ తారకంగా జిపిఎస్ తెచ్చామని చెబుతున్నారు. అంతేగాదు తమ విధానమే దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శమవుతుందని గొప్పలు చెబుతున్నారు.

> సిపిఎస్ రద్దు కోసం పోరాటం అంటే ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా యుటిఎఫ్ నాయకత్వం 65 మందిపై అనేక రకాల సెక్షన్లు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. అంతే తప్ప పాత పెన్షన్ విధానం కోసం పోరాడుతున్న సంఘాలతో ముఖ్యమంత్రిగాని, రాష్ట్ర ప్రభుత్వం గాని జిపిఎస్‌పై చర్చించలేదు.

దేశంలో సిపిఎస్ విధానం అమలులోకి తెచ్చేటప్పుడు ఆనాటి బిజెపి ప్రభుత్వం కూడా రిటైర్ అయిన తర్వాత లక్షలాది రూపాయలు ప్రయోజనం కలుగుతుందని, పాత పెన్షన్ విధానం కంటే ఎక్కువ పెన్షన్ లభిస్తుందని ఉద్యోగులను భ్రమలకు గురి చేసింది. దానికి కాంగ్రెస్ కూడా వంతపాడింది. 20 సంవత్సరాలు గడిచాక దాని అసలు స్వరూపం ఏమిటో అందరికీ అర్థమైంది. అందుకే ఎవరు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామంటే వారికి ఉద్యోగులు అండగా నిలుస్తున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తున్నారు. తాజాగా జరిగిన హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ఎన్నికల ఉదంతం పరిశీలిస్తే అర్థమవుతుంది. పాత పెన్షన్ విధానం అమలు చేస్తానన్న కాంగ్రెస్‌కే పట్టం గట్టారు.

మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం టక్కర్ కమిషన్‌ను నియమించింది. దాని సిఫారసుల మేరకు 50 శాతం పెన్షన్ కూడా ఇస్తామని చెప్పింది. కాని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తానన్న జగన్‌కే ఉద్యోగులు ఓట్లు వేశారు. అధికారంలోకి తెచ్చారు. తీరా ఇప్పుడు జిపిఎస్ అమలు చేస్తామని మంత్రివర్గం ప్రకటించడంతో ప్రభుత్వం తమని మోసగించిందని ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు.

సిపిఎస్ రద్దు కోసం పోరాటం అంటే ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా యుటిఎఫ్ నాయకత్వం 65 మందిపై అనేక రకాల సెక్షన్లు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. అంతే తప్ప పాత పెన్షన్ విధానం కోసం పోరాడుతున్న సంఘాలతో ముఖ్యమంత్రిగాని, రాష్ట్ర ప్రభుత్వం గాని జిపిఎస్‌పై చర్చించలేదు. కేవలం తమకు అనుకూలమైన జెఏసి నాయకులతోనే చర్చించి నిర్ణయాన్ని ప్రకటించారు.

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతున్న గ్యారంటీ పెన్షన్ విధానం పట్ల కూడా ఉద్యోగుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిపిఎస్ విధానం ఆచరణలో కాగితాలకే పరిమితమవుతుందా? పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టం నుండి వైదొలగకుండా ఏ విధంగా అమలు చేస్తారు? జిపిఎస్‌కు చట్ట బద్ధత ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మంత్రివర్గ నిర్ణయాల్లో మరొక ప్రధానాంశం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో సుమారు 18 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరుగాక వివిధ కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్శిటీలు, స్థానిక సంస్థలలో పనిచేసే టైమ్‌స్కేల్, ఫుల్‌టైం కంటింజెంట్, డైలీ వేజ్, పార్ట్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగులు మరో 50 వేల మంది ఉంటారని అంచనా. పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమితులైన ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వ విభాగాలలో నోటిఫికేషన్ ఇచ్చి రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు అనుగుణంగా నియమితులైన వారు 10,117 మంది ఉన్నారు. వీరిలో రాష్ట్ర విభజన నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు మంత్రివర్గం ప్రకటించింది. అంటే, మొత్తం కాంట్రాక్టు ఉద్యోగుల్లో కేవలం 6,666 మంది మాత్రమే రెగ్యులరైజ్ అవుతారు. మిగిలిన వారి సంగతి ఏమిటన్నది స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. తమను కూడా రెగ్యులర్ చేయాలని వారు కోరుతున్నారు.

మరొక ముఖ్య నిర్ణయం 12వ పిఆర్‌సి ఏర్పాటు. గత పిఆర్‌సి సందర్భంగా కనీసం రిపోర్టు కూడా బయటపెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఉద్యోగులు ఇంకా మరచిపోలేదు. ఇచ్చిన ఐ.ఆర్. 27 శాతం కంటే తక్కువ 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి పిఆర్‌సి అమలు చేశారు. మొత్తం డిఏలన్నిటిని ముద్దగా కలిపేశారు. పిఆర్‌సి, డిఏ అరియర్లు రూ.7,382 కోట్లు ఇప్పటివరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పైగా నాలుగేళ్లలో వాయిదాల రూపంలో చెల్లిస్తామని చెబుతున్నారు. ఎన్నికలు జరిగే నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఒక వాయిదా అంటే 175 కోట్లు మాత్రమే చెల్లిస్తుంది. మిగిలిన బకాయి సంగతేమిటి?

> గత పిఆర్‌సి బకాయిలు చెల్లించకుండానే ఇప్పడు కొత్త పిఆర్‌సి అని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించిన 12వ పిఆర్‌సి ఎప్పుడు తన నివేదిక ఇస్తుందో, పిఆర్‌సి ఎప్పుడు అమలుకు నోచుకుంటుందో, పిఆర్‌సి అరియర్లు ఏ విధంగా చెల్లిస్తారో తెలియదు. అంటే ఈ ప్రకటన రానున్న ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకుని చేసినది తప్ప మరొకటి కాదు.

ఇలాంటి పరిస్థితుల్లో గత పిఆర్‌సి బకాయిలు చెల్లించకుండానే ఇప్పుడు కొత్త పిఆర్‌సి అని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించిన 12వ పిఆర్‌సి ఎప్పుడు తన నివేదిక ఇస్తుందో, పిఆర్‌సి ఎప్పుడు అమలుకు నోచుకుంటుందో, పిఆర్‌సి అరియర్లు ఏ విధంగా చెల్లిస్తారో తెలియదు. అంటే ఈ ప్రకటన రానున్న ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకుని చేసినది తప్ప మరొకటి కాదు.

జిల్లా కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లింపు, సొసైటీలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు వంటి నిర్ణయాలు కొద్దిమందికి ప్రయోజనం కలిగించే అంశాలుగా ఉన్నప్పటికీ ప్రధానంగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, బకాయిల చెల్లింపులపై అరకొర నిర్ణయాలు ఎవరికీ సంతృప్తికరంగా లేవు.

కాబట్టి, రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు పున:సమీక్షించాలి. ప్రకటించిన గ్యారంటీ పెన్షన్ విధానానికి బదులుగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంపుదల చేయాలి. వీటి సాధనకై ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఐక్య ఉద్యమాలకు కదలి రావాలి.

(వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

★

గ్రామ పంచాయితీ కార్మికుల గోడు పట్టదా?

సమస్య



> ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగుల నియామకాలు చేయకపోవడం వల్ల వారి స్థానంలో పార్ట్‌టైమ్, టెండర్ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లను నియమించాల్సి వచ్చింది. కాబట్టి గ్రీన్ అంబాసిడర్ల జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. వారి ఉద్యోగాలు నిలబెట్టాలి. గ్రామీణ పారిశుధ్యానికి గ్యారెంటీ ఇవ్వాలి. టెండర్ విధానాన్ని రద్దు చేసి, టెండరు కార్మికులందరినీ ప్రతి ఏటా రెన్యువల్ విధానం లేకుండా రెగ్యులర్‌గా కొనసాగించాలి. టెండరు, పార్ట్‌టైమ్ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఎన్నికల హామీ మేరకు "సమాన పనికి సమాన వేతనం", "కనీసం 10 వేల రూపాయల జీతం" లాంటి హామీలు అమలు చేయాలి.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్ళు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చిందని ప్రకటించారు. ఇదే అదనుగా కొంతమంది వందిమాగధులు ముఖ్యమంత్రిని అదే పనిగా స్తుతించడం మొదలెట్టారు. అయితే రాష్ట్ర జనాభాలో మూడింట రెండు వంతులు నేటికీ గ్రామాల్లోనే నివసిస్తున్నారు. అలాంటి గ్రామీణ జనాభాకు నిత్యం సేవలందిస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేశారా? వారి సమస్యల పరిష్కారం గురించి ప్రభుత్వం ఏనాడైనా శ్రద్ధ తీసుకున్నదా?

పర్మినెంట్ హామీ

గ్రామ పంచాయితీల్లో కార్యనిర్వహణాధికారి మినహా మిగిలిన పనుల్లో ఉన్న పర్మినెంట్ సిబ్బంది నామమాత్రం. ఉదాహరణకు, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం లోని 29 గ్రామాల్లో మొత్తం 164 మంది కార్మికులు పనిచేస్తుండగా వారిలో ముగ్గురే పర్మినెంట్ వారు. దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో పనిచేసే 154 మంది కార్మికుల్లో ఇద్దరు పర్మినెంట్. పెదనందిపాడు మండలం 17 గ్రామాల్లోని 114 మంది కార్మికుల్లో ఒక్కరే పర్మినెంట్. తెనాలి రూరల్ మండలం 18 గ్రామాల్లో పనిచేసే 188 మందిలో ఇద్దరు పర్మినెంట్. గుంటూరు రూరల్, మేడికొండూరు మండలాల్లో పర్మినెంట్ కార్మికులు లేరు.



వై. నేతాజి

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అంటే సుమారు 43 ఏళ్ళ క్రితం గ్రామ పంచాయితీల్లో పర్మినెంట్ కార్మికుల సంఖ్య నిర్ధారించబడింది. తరువాత కాలంలో గ్రామాల్లో జనాభా, ఇళ్ళ సంఖ్య అనేక రెట్లు పెరిగాయి. ఆనాడు లేని కరెంట్, మంచినీటి సౌకర్యాలు, గ్రామీణ రోడ్లు, మురుగు కాల్వలు తదితరాలు పంచాయితీల్లో ఏర్పాటు చేయబడ్డాయి. వాటి నిర్వహణ పనుల్లో సేవలు అందించేందుకు అవసరమైన కార్మికుల పోస్టులను ప్రభుత్వాలు శాశ్వత ప్రాతిపదికన మంజూరు చేయలేదు. అందువల్ల శాశ్వత ఉద్యోగుల స్థానంలో పార్ట్‌టైమ్, టెండర్ కార్మికుల పేరుతో సిబ్బందిని జిల్లా పాలనా యంత్రాంగం అనుమతితో నియమించడం జరిగింది. వీరికి పర్మినెంట్ ఉద్యోగులకు వర్తించే జీతభత్యాలు, ఇతర ఏ సౌకర్యాలు అమలు జరగడంలేదు. పార్ట్‌టైమ్ ఉద్యోగుల్లో కొద్దిమందిని సుమారు మూడేళ్ళ క్రితం రెగ్యులర్ పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి ఇతర గ్రామాలకు పంపారు. వీరికి గత పిఆర్‌సి లోని బేసిక్ వేతనం కేవలం రూ.13 వేలుగా నిర్ణయించారు. ఆ జీతం కూడా ప్రభుత్వం ఇవ్వక పోవడంతో నేటికీ గ్రామ పంచాయితీల నుండే తీసుకుంటున్నారు. వారు ఇతర గ్రామాల్లో విధులు నిర్వర్తించాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులు లేదా పని చేసే గ్రామంలో నివాసం కోసం ఇంటి అద్దెలు అదనంగా భరించాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి వారిని మరింతగా ఆర్థిక ఇబ్బందుల్లో పడేసినట్లయింది.

ఇతర హామీల అమలు మాటేమిటి?

వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 'సమాన పనికి సమాన వేతనం, చిన్న ఉద్యోగులందరికీ 10 వేలకు తక్కువ లేకుండా జీతం' ఇస్తామని హామీ ఇచ్చారు. నాలుగేళ్ళు దాటినా ఈ హామీలు గ్రామ పంచాయితీ కార్మికులకు అమలు కాలేదు. దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో పని చేస్తున్న పర్మినెంట్ స్వీపర్ జీతం నెలకు రూ.49,115. దీన్ని ప్రభుత్వమే చెల్లిస్తున్నది. టెండరు కార్మికులుగా గత పాతికేళ్ళ పైబడి అదే పని చేస్తున్న వారికి దానిలో నాల్గవ వంతు జీతం కూడా చెల్లించడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం 2022 జనవరి నుండి అమలు చేస్తున్న నూతన పే రివిజన్ ప్రకారం రాష్ట్రంలో దిగువ స్థాయి పర్మినెంట్ ఉద్యోగులైన అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్ లాంటి వారి బేసిక్ వేతనం రూ.20 వేలు. రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించే కనీస వేతనం నెలకు రూ.15 వేలుగా నిర్ణయించారు. గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న అటెండరు, పార్ట్‌టైమ్ కార్మికులకు ఈ రెండిటిలో ఏ ఒక్కదానితో సమానమైన వేతనాలూ ఇవ్వడంలేదు. చివరికి వైసిపి మ్యానిఫెస్టోలో పేర్కొన్న చిరుద్యోగులకు కనీస వేతనం రూ.10 వేలు ఇస్తామన్న హామీ ప్రకారం కూడా గ్రామ పంచాయితీ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయం. పొన్నూరు మండలం లోని 161 మంది కార్మికుల్లో కేవలం ఇద్దరికి మాత్రమే రూ.10 వేలు, రూ.10,500 జీతం ఇస్తున్నారు. మిగతా వారందరికీ రూ.10 వేల లోపు జీతమే. ఇతర మండలాల్లో పని చేస్తున్న పంచాయితీ కార్మికుల్లో 60 నుండి 90 శాతం మంది పంచాయితీ కార్మికులకు రూ.10 వేల లోపు జీతం చెల్లించబడుతున్నది. కొంతమంది పంచాయితీ కార్మికులకు రూ.3 వేల జీతం కూడా చెల్లిస్తున్నారు.

ఉద్యోగుల తొలగింపు

ఐదేళ్ళ క్రితం గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య పనులు నిర్వర్తించే నిమిత్తం గ్రీన్ అంబాసిడర్ల పేరుతో అన్ని గ్రామ పంచాయితీల్లో కార్మికులను నియమించారు. చిన్న పంచాయితీల్లో వీరు తప్ప పారిశుధ్య పనులు నిర్వర్తించే కార్మికులే లేరు. కరోనా సమయంలో వీరు గ్రామీణ ప్రజానీకానికి చేసిన సేవలు నిరుపమానం. కరోనా రోగులకు బంధుమిత్రులు కూడా చేయని సహాయం వీరు చేశారు. ఆ సందర్భంగా వీరిని ప్రభుత్వమూ, ప్రజానీకం పొగడ్తలతో ముంచెత్తారు. ఇంత సేవ చేసిన గ్రీన్ అంబాసిడర్లకు గత ఐదేళ్ళుగా చెల్లించినది నెలకు 6 వేలు మాత్రమే. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్ ద్వారా చెల్లించబడింది. 2022-23 ఆర్థిక సంవత్సరం నుండి వీరి జీతాల చెల్లింపు బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంది. వీరిని పనిలో కొనసాగించాలా? వద్దా? జీతాలు ఎవరు చెల్లించాలి? ఎంత చెల్లించాలి? అనే విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి గత ఏడాది కాలంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీనివల్ల గ్రీన్ అంబాసిడర్ల జీతాల చెల్లింపు బాధ్యత గ్రామ పంచాయితీలపై పడింది. అసలే అంతంత మాత్రం ఆదాయాలతో కునారిల్లుతున్న గ్రామ పంచాయితీలు పారిశుధ్య కార్మికుల (గ్రీన్ అంబాసిడర్ల) జీతాలు చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. వేరే దారిలేక చాలా పంచాయితీల్లో వీరిని పని నుండి తొలగిస్తున్నారు. ఫలితంగా గ్రామీణ పారిశుధ్యం తీవ్రంగా దెబ్బ తినే ప్రమాదం పొంచి ఉంది. మరోపక్క గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలు ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడబోతున్నాయి. తమది ఉద్యోగాలు ఇచ్చే ప్రభుత్వమేకానీ, తీసివేసే ప్రభుత్వం కాదని పదే పదే ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తన బాధ్యత ఏమీ లేనట్లు చోద్యం చూస్తున్నది.

జీతాలు చెల్లింపు బాధ్యత ఎవరిది?

ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్న గ్రామ సచివాలయాల ఉద్యోగుల జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే వారధులుగా ఉన్న వాలంటీర్లు, రేషన్ వాహనదారుల జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నది. గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్యనిర్వహణాధికారి, ఇతర పర్మినెంట్ సిబ్బంది జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నది. గత 43 ఏళ్ళుగా పెరిగిన గ్రామీణ కుటుంబాలు, జనాభా వారికి కల్పించే అదనపు సౌకర్యాలకు అనుగుణంగా పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్యను పెంచి, నియమించి ఉంటే వారి జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి ఉండేది కదా. ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగుల నియామకాలు చేయకపోవడం వల్ల వారి స్థానంలో పార్ట్‌టైమ్, టెండర్ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లను నియమించాల్సి వచ్చింది. కాబట్టి గ్రీన్ అంబాసిడర్ల జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. వారి ఉద్యోగాలు నిలబెట్టాలి.

గ్రామీణ పారిశుధ్యానికి గ్యారెంటీ ఇవ్వాలి. టెండర్ విధానాన్ని రద్దు చేసి, టెండరు కార్మికులందరినీ ప్రతి ఏటా రెన్యువల్ విధానం లేకుండా రెగ్యులర్‌గా కొనసాగించాలి. టెండరు, పార్ట్‌టైమ్ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఎన్నికల హామీ మేరకు "సమాన పనికి సమాన వేతనం", "కనీసం 10 వేల రూపాయల జీతం" లాంటి హామీలు అమలు చేయాలి. లేనిపక్షంలో పోరుబాట వుండనే వుంది.

(వ్యాసకర్త సి.ఐ.టి.యు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి)

జనవాక్యం

గోప్యతా హక్కు హుంబక్కు

ప్రజలకు కరోనా టీకా అందించడానికి ఉపయోగించిన కోవిన్ యాప్ నుండి వ్యక్తుల వివరాలన్నీ లీక్ అయ్యి టెలిగ్రామ్ యాప్‌లో ప్రత్యక్షమయ్యాయన్నది నడుస్తోన్న వివాదం. అధికారిక ఖాతా నుండే ఇలా వివరాలు బజారులోకి ప్రవహిస్తే సమాచార గోప్యతకు, డేటా రక్షణకు పూచీ ఏమిటన్నది అందరి ఆందోళన.' అలా కోవిన్ ద్వారా లీక్ కాలేదు...ఆ వివరాలన్నవి ముందే లీక్ అయి ఉండొచ్చన్నది ప్రభుత్వ వివరణ. ప్రస్తుత అంతర్జాల యుగంలో సైబర్ స్పేస్‌లో డేటాకి ఎలాంటి భద్రతా లేదు. ఒకసారి సైబర్ స్పేస్ లోకి వెళ్లిన సమాచారం వీధిలో ఉన్నట్టే. అయితే అలా జరగకుండా ఉండడానికి ప్రభుత్వం చెయ్యవలసినదంతా చెయ్యాలి. అనుమతి లేకుండా, ఒకరి సమాచారం వీధిలో పెడితే భాద్యుల్ని శిక్షించాలి. నియమాలు కఠినతరం చెయ్యాలి. ఆ దిశగా ప్రయత్నాలు వేగంగా జరగడం లేదన్నదే ఆందోళన. 2017లో సుప్రీంకోర్టు వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవడం పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అంటే ఆ హక్కుని పరిరక్షించాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ తీర్పు స్ఫూర్తితో డేటా పరిరక్షణ చట్టం ఇప్పటికే అమలులో ఉండాల్సింది. అయితే అలా జరగలేదు. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అయినదానికీ, కానిదానికీ వ్యక్తుల వివరాలన్నీ వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. వాటిని జాగ్రత్త పరిచే బాధ్యత, భయం ఆ సంస్థలకు లేదు. దుర్వినియోగం చేసినా ఏమీ చెయ్యలేని స్థితి లేదా చిన్నచిన్న శిక్షలు, జరిమానాలతో సరి. అందుకే డేటా పరిరక్షణ చట్టం వెంటనే పట్టాలకెక్కాలి. లేదంటే ప్రమాదం.

– డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎపిఇఎపి సెట్ ర్యాంకర్ల మనోగతం

కంప్యూటర్ ఇంజనీర్‌నవుతా
స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ఉమేష్ వరుణ్




దేశంలోని ప్రముఖ ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ చదవి కంప్యూటర్ ఇంజనీర్ కావడమే తన లక్ష్యమని ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఎన్‌టిఆర్ జిల్లా నందిగామకు చెందిన చల్లా ఉమేష్ వరుణ్ తెలిపాడు. ఆయన 158.3 మార్కులు సాధించాడు రోజుకు 8 నుంచి 12 గంటల వరకు పట్టుదలతో కష్టపడి చదవడం వల్లనే ఈ ర్యాంక్ సాధించగలిగానని చెప్పాడు. గత నెలలో ప్రకటించిన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లోనూ స్టేట్ 3వ ర్యాంకు సాధించాడు. వరుణ్ ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గుంటూరులోని భాష్యం విద్యా సంస్థల్లో చదివాడు. వరుణ్ తండ్రి విశ్వేశ్వరరావు లాయర్, తల్లి దేవకీదేవి గృహిణి.

వైద్యుడు కావడమే లక్ష్యం
స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ సత్యరాజ జస్వంత్




ఎపి ఇఎపి సెట్‌లో పేదింటి విద్యాకుసుమం విరిసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కాతేరు మల్లయ్యపేటకు చెందిన బూరుగుపల్లి సత్యరాజ జస్వంత్ మొదటి ర్యాంకు సాధించాడు. గతంలో తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ తెచ్చుకున్నాడు. నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా క్యాటగిరీలో 65 ర్యాంక్ సాధించాడు. జస్వంత్ తండ్రి సాయిరామకృష్ణ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి వైద్యునిగా సేవలందించాలని తన కోరికని, ఈ లక్ష్యంతోనే మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా అభ్యసించానని జస్వంత్ తెలిపారు. ప్రతి రోజు 13 గంటలు అధ్యయనం చేశానని చెప్పారు.

డాక్టర్ కావాలనేది లక్ష్యం
2వ ర్యాంకర్ వరుణ్ చక్రవర్తి



ఎంబిబిఎస్ చదివి డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని ఎపి ఇఎపిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం తోటాడకు చెందిన బోర వరుణ్ చక్రవర్తి తెలిపాడు. అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్‌లో మొత్తం 160 మార్కులకుగానూ 151.0651 మార్కులు తెచ్చుకున్నాడు. ఆయన తండ్రి రాజేంద్రనాయుడు... నరసన్నపేటలో జిల్లా పరిషత్ పాఠశాలలో, తల్లి రాజ్యలక్ష్మి పోలాకి మండలం దీర్ఘాసి ఎంపిపి పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. ఇంటర్ విజయవాడ లోని శ్రీ చైతన్య కళాశాలలో చదివి 987 మార్కులు తెచ్చుకున్నాడు. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు.

న్యూరాలజిస్ట్ అవుతా
రాజ్‌కుమార్, 3వ ర్యాంకు, అగ్రి ఫార్మా



మంచి ర్యాంకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. శ్రీచైతన్య గోశాల బ్రాంచి (విజయవాడ)లో కోచింగ్ తీసుకున్నా. సబ్జెక్ట్ పరంగా అన్ని అంశాలపై పట్టు సాధించేలా మా అధ్యాపకులు మంచి శిక్షణ ఇచ్చారు. మా నాన్న జిఎస్‌టి ఉద్యోగి. అమ్మ టీచర్. వారి ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైంది. ఎపి ఎంసెట్‌లో 3వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 24వర్యాంకు వచ్చింది. నీట్‌లో ఆల్‌ఇండియా 707 ర్యాంకు వచ్చింది. భోపాల్ ఎయిమ్స్‌లో వైద్యవిద్యను అభ్యసించి మంచి న్యూరాలజిస్ట్ అవుతా.

తల్లిదండ్రుల కష్టం ఫలించింది
నందిపాటి సాయి దుర్గారెడ్డి, 3వ ర్యాంకర్



పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన నందిపాటి సాయిదుర్గారెడ్డి ఇంజనీరింగ్ విభాగంలో మూడో ర్యాంక్ సాధించాడు. తన తల్లిదండ్రులు దుర్గమ్మ, నారపరెడ్డి వ్యవసాయం చేస్తారని, వారి కష్టానికి ఫలితం దక్కిందని ఆయన పేర్కొన్నాడు. ఉన్నత ప్రమాణాలున్న కళాశాలలో సిఎస్‌సిలో సీటు సాధిస్తానన్నాడు. వ్యవసాయ అధారిత కుటుంబం నుండి వచ్చి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై పలువురు దుర్గారెడ్డిని అభినందించారు. తెలంగాణా ఎంసెట్‌లో కూడా తాను 18వ ర్యాంకు సాధించాడు.

సిఎస్ఇ చదవాలనుకుంటున్నా
బిక్కిన అభినవ్ చౌదరి, 2వ ర్యాంకర్



స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం, అమ్మా నాన్న ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. నా చదువు కోసం వారు ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. మాదాపూర్, కావూరి హిల్స్ శ్రీ చైతన్యలో కోచింగ్ తీసుకున్నా. మా సార్లు మంచి గైడెన్స్ ఇచ్చారు. ఎపి ఇఎపి సెట్‌లో 2వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 12వ ర్యాంకు వచ్చింది. ముంబై ఐఐటిలో సిఎస్ఇ చదవాలని అనుకుంటున్న.

బాంబే ఐఐటీలో సీటే లక్ష్యం
బాబు సజన్ రెడ్డి, 4వ ర్యాంకర్



'తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఎంసెట్లో నాలుగో ర్యాంకు సాధించాను. బాంబే ఐఐటిలో సీటు సాధించడమే నా లక్ష్యం' అని సి.బాబు సృజన్‌రెడ్డి తెలిపారు. ఎపి ఇఎపి సెట్లో నాలుగో ర్యాంకు సాధించిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పల్లి సర్కిల్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివానని, తన తల్లిదండ్రులు కవిత, యుగంధర్‌రెడ్డిలు ఎంతో ప్రోత్సహించారని, నిరంతరం కష్టపడి ఉన్నత ర్యాంకు సాధించానని చెప్పారు. ఐఐటి బాంబేలో కంప్యూటర్ సైన్స్ చేయడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో జెఇఇ మెయిన్స్‌లో అడ్వాన్స్‌లో ఉన్నత ర్యాంకు సాధించే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా చదివానన్నారు. నారాయణ కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహం, కృషి, వారు చెప్పిన సూచనలు బాగా ఉపయోగపడ్డాయని తెలిపారు.

డాక్టర్‌గా సేవలందిస్తా
సాయి అభినవ్, 4వ ర్యాంకర్



'చిన్నప్పటి నుంచి నారాయణ కళాశాల విజయవాడ గోశాల క్యాంపస్‌లో చదువుతున్నాను. గొప్ప డాక్టర్‌గా ఎదిగి పేదలకు సేవలందించడమే నా లక్ష్యం' అని ఎపి ఇఎపి సెట్‌లో 4వ ర్యాంక్ సాధించిన సాయి అభినవ్ తెలిపారు. 'ప్రజాశక్తి' ఆయన ఫోన్లో మాట్లాడాడు. ఇటీవల విడుదలైన నీట్ జాతీయ స్థాయి పరీక్షలో 1122 ర్యాంకు వచ్చిందని చెప్పారు. జాతీయస్థాయి నీట్‌కి పూర్తి స్థాయిలో ప్రిపేర్ కావడం, తక్కువ సమయంలో రాష్ట్ర సిలబస్‌ను ముఖ్యంగా బయాలజీని చదవడం ద్వారా ఎపి ఎంసెట్లో మంచి ర్యాంకు సాధించగలిగానని చెప్పారు. విజయవాడలోని గోశాల క్యాంపస్ అధ్యాపకుల ప్రోత్సాహం, సూచనలు, సలహాలు, ప్రణాళికబద్ధంగా చదవడంతో ఉన్నత ర్యాంకు సాధించగలిగానన్నారు.

కార్డియాలజిస్టును అవుతా
కార్తికేయరెడ్డి, 5వ ర్యాంకర్



గుంటూరు జిల్లా తెనాలి మారిసుపేటకు చెందిన దుర్గెంపూడి కార్తికేయరెడ్డి ఎపిఇఎపి సెట్ అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. తల్లి ఉమామహేశ్వరి గృహిణి, తండ్రి వెంకటరామిరెడ్డి విద్యుత్ శాఖలో ఎఇగా పనిచేస్తూ కోవిడ్ సమయంలో మృతి చెందారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన సంస్థలో ఎంబిబిఎస్ పూర్తిచేస్తానని, కార్డియాలజిస్టు అవుతానని, అది తన కల అని కార్తికేయరెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఆల్ ఇండియా స్థాయి నీట్‌లో జనరల్ కేటగిరీలో 237 సాధించారు.

ముంబయి ఐఐటిలో సీటే లక్ష్యం
వెంకట యుగేష్, 5వ ర్యాంకర్



ముంబయి ఐఐటిలో సీటు సాధించడమే లక్ష్యమని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఎస్.వినగర్‌కు చెందిన ఎపి ఇఎపి సెట్ స్టేట్ ఐదవ ర్యాంకర్ దుగ్గినేని వెంకట యుగేష్ అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి ఆరవ తరగతి వరకు తిరుపతి శ్రీ చైతన్య పాఠశాలలో, ఏడవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడ శ్రీ చైతన్యలో చదివానని చెప్పారు. యుగేష్ తండ్రి యుగంధర్ నాయుడు గుంటకల్ పరిధిలోని ఎపిఎస్‌పిడిసిఎల్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

నాడు రక్త తర్పణం.. నేడు రక్తదానం..

- స్టీల్‌ప్లాంట్ రక్షణకు సిఐటియు సరికొత్త పంథా
- రక్తం ఇచ్చి ప్లాంట్‌ను నిలబెట్టే విధానమూ ఓ ఉద్యమమే : డాక్టర్ కె రామ్మూర్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నాడు 32 మంది ప్రాణ త్యాగం చేసి రక్తం చిందించాక ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునే క్రమంలో నేడు రక్తదానం చేసి నిలబెట్టుకునే విధానం తీసుకోవడమూ గొప్ప విషయమని ప్రముఖ వైద్యులు, ఐఎంఎ మాజీ కార్యదర్శి డాక్టర్ కె రామ్మూర్తి పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం విశాఖ స్టీల్‌ప్లాంట్ అంబేద్కర్ భవనం సిడబ్ల్యుసి-1 వద్ద 'గేవ్ బ్లడ్...సేవ్ ప్లాంట్' అనే పేరుతో రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్, స్టీల్‌ప్లాంట్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తర్ మహమ్మద్ అనీఫ్, పలు కార్మిక సంఘాల నేతలు సందర్శించి రక్తదాతలను అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 564 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రామ్మూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం చేసిన కార్మికులను, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. స్టీల్‌లో ఎలాగైతే ముడిసరుకు ఐరన్ ముఖ్యమో.. మనిషి రక్తంలోనూ ముడిసరుకైన ఐరన్ అంతే ముఖ్యమై నదని, ఆ... ఐరన్ (స్టీల్)ని, ఈ....ఐరన్ (రక్తం)తో రక్షించుకోవాలన్నారు. 'గేవ్ బ్లడ్...సేవ్ ప్లాంట్' సిఐటియు నినాదం బాగుందని కితాబి చ్చారు. ఒకరి రక్తదానంతో ముగ్గురు ప్రాణాలు నిలబడతాయని, హెచ్‌పి, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా ఈ మూడింటినీ ముగ్గురు పేషెంట్లకు ఇవ్వొచ్చని వివరించారు. తాను 1972లో మెడికల్ కాలేజీలో చేరేందుకు విశాఖకు వచ్చినప్పుడు 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' ఉద్యమం నడుస్తోందని తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, త్యాగాలు చేసి ఉక్కును స్థాపించుకున్నా.. నేడు సమస్యలు తలెత్తడం బాధాకరమన్నారు. సుమారు 2000 సంవత్సరంలో విశాఖలో ఉన్న టిబి ఆస్పత్రి, ఇతర ప్రభుత్వ సంస్థల స్థలాలనూ ప్రయివేట్‌కివ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) కార్యదర్శిగా తాను హైకోర్టునాశ్రయించి ఎలా విజయం సాధించారో వివరించారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకూ ఉద్యమాన్నీ ఆపకూడదని సూచించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె అయోధ్యరామ్ మాట్లాడుతూ 853 రోజుల నుంచి ఉద్యమం సాగుతోందని తెలిపారు. రక్తం ఇచ్చి ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, రామస్వామి, సీనియర్ నాయకులు రామారావు పాల్గొన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ రామ్మూర్తి మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఒంటరిగానే పోటీ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమైనా వైసిపి ఒంటరిగానే పోటీ చేస్తుందని అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు వద్ద రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన తోపుదుర్తి మహిళా సహకార 'అమ్మ డెయిరీ'ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగించారు. టిడిపి, బిజెపి 2014లోలానే మరోసారి 2024లో కలిసి పోటీ చేస్తారేమోనని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలు వచ్చే ఎన్నికల్లో వైసిపి మరోసారి అధికారాన్ని తెస్తాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయంగా శక్తి హీనుడయ్యారని, అందువల్ల ఆయన అందరి సహకారం తీసుకుంటున్నారని విమర్శించారు. రాయలసీమకు ఎవరు ఎంత మేలు చేశారన్న విషయం ప్రజలకు బాగా తెలుసన్నారు. అనంతపురం జిల్లాలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మ డెయిరీని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజల కోసం దీనిని ఆయన రూ.20 కోట్ల సొంత నిధులతో ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి అమ్మ డెయిరీ లోగోను మంత్రులు ఆవిష్కరించారు.

15 ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్లు తెరుస్తాం

- సామ్‌సంగ్ వెల్లడి



హైదరాబాద్ : ప్రస్తుత ఏడాదిలో దేశ వ్యాప్తంగా 15 ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్లను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ కంపెనీ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ షాప్స్ హెడ్ రాహుల్ సింగ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో నూతన స్టోర్‌ను ఆయన లాంచనంగా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇది దేశంలో తమకు నాలుగో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్ అని తెలిపారు. మరో 11 అవుట్‌లెట్‌లను అందుబాటులోకి తేనున్నామన్నారు. వీటిని 8-10 నగరాల్లో ఏర్పాటు చేయనున్నామన్నారు. తమ రిటైల్ మార్కెట్‌లో తెలుగు రాష్ట్రాలు కీలక వాటాను కలిగి ఉన్నాయన్నారు. తెలంగాణలో 56, ఎపిలో 58 స్టోర్లు ఉన్నాయన్నారు. తెలంగాణలోని ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల వ్యాపారంలో 60 శాతం వాటాను లక్ష్యంగా చేసుకున్నామన్నారు. నూతన స్టోర్‌లో తొలి వారంలో పలు ప్రత్యేక డిస్కౌంట్‌లను అందిస్తున్నామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న లోకేష్

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- నారా లోకేష్

ప్రజాశక్తి-మర్రిపాడు (నెల్లూరు జిల్లా)

మంత్రి కాకాణి గోవవర్ధన్‌రెడ్డి రైతులను వదిలేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. గోవర్ధన్‌రెడ్డి కోర్టులో దొంగతనం కేసులతో బిజీగా ఉన్నారని విమర్శించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నాయుడుపల్లిలో యువగళం పాదయాత్రలో భాగంగా బుధవారం రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. రైతుపై ఉన్న తలసరి అప్పులో ఎపిని నంబర్ వన్‌గా జగన్ మార్చారని విమర్శించారు. టిడిపి హయాంలో ఒక్కో రైతుపై రూ.75 వేలు అప్పు ఉంటే.. జగన్ పాలనలో ఒక్కో రైతుపై రూ.2.50 లక్షల అప్పు పెరిగిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను ఆదుకోవడానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే టిడిపి లక్ష్యమని అన్నారు. నెల్లూరు జిల్లాకి చెందిన వ్యక్తి ఇరిగేషన్ మంత్రిగా పని చేసినా జిల్లాలో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని విమర్శించారు. జిల్లాకి చెందిన వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి కోర్టు దొంగ అని, ఆయన సిబిఐ కేసులో బిజీగా ఉన్నాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సోమశిల ప్రాజెక్టు పూర్తి చేసి ముంపు బాధితులకు పరిహారం అందిస్తామని, పిల్ల కాలువలు కూడా పూర్తి చేసి ప్రతి ఎకరానికీ సాగు నీరు అందిస్తామన్నారు. మామిడి, అరటి, దానిమ్మ, ఖర్జూరం, బొప్పాయి ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా కంపెనీలతో ఒప్పందం చేసుకొని రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం యువగళం పాదయాత్ర 126వ రోజు 1600 వందల కిలో మీటర్లకు చేరిన సందర్భంగా చుంచులూరులో స్థూపాన్ని ఆవిష్కరించారు. పాదయాత్రలో ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపి పనబాక లక్ష్మి, తాళ్లపాక అనురాధ, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరుద్ర విషయంలో నిర్దయగా ప్రభుత్వం

టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడకు చెందిన ఆరుద్ర విషయంలో వైసిపి ప్రభుత్వం ఎందుకింత నిర్దయగా వ్యవహరిస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ఒక బాధిత మహిళ కష్టం తీర్చలేని విధంగా ప్రభుత్వ వ్యవస్థలు ఎందుకు తయారయ్యాయని బుధవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. బిడ్డ వైద్యం కోసం తల్లి చేస్తున్న పోరాటాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు? ఆరోగ్యశ్రీ ఏమైంది? అని ప్రశ్నించారు. ఒక మహిళ చేస్తున్న పోరాటానికి స్పందించకపోవడమే వైఎస్ జగన్ మానవీయతా? అని అన్నారు. న్యాయం కోరుతూ ఏకంగా సిఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించిన మహిళ సమస్యను ఏడాది కాలంగా ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని ప్రశ్నించారు. 'ప్రశ్నించిన ఆమెకు మానసిక పరిస్థితి సరిగ్గా లేదంటారా? పైగా పిచ్చాస్పత్రికి తరలిస్తారా? అసలు ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లడానికి కారణం ఎవరు? ఆమెను చివరికి ఏం చేయబోతున్నారు?' అంటూ ప్రశ్నించారు. వెంటనే ఆరుద్ర సమస్యను పరిష్కరించాలని, ఆమె కుటుంబానికి తగిన సాయం అందించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో బాలిక సజీవదహనం

ప్రజాశక్తి-అచ్చంపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా పెదపాలెంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. 15 పూరిళ్లు దగ్ధం కావడంతో ఓ ఇంట్లో నిద్రిస్తున్న ఏడాది పాప సజీవ దహనమైంది. పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాలెం దళితవాడలో పేదలకు చెందిన పూరిళ్లపై నిప్పురవ్వలు పడడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒక ఇంట్లోని ఉయ్యాలలో నిద్రిస్తున్న జర్రిపోతు పల్లవి అనే ఏడాది పాప మృతి చెందింది. ఈ ప్రమాదంలో తన మనవరాలిని కాపాడేందుకు యత్నించిన దాములూరి వెంకాయమ్మకు మంటలు అంటుకుని గాయపడడంతో ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా గాలుల ధాటికి వాటిని అదుపుచేయలేకపోయారు. చంటి పాపను కాపాడే సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భయానక వాతావరణం అలుముకుంది. అగ్నిమాపక వాహనం వచ్చేసరికి మొత్తం ఇళ్లన్నీ భస్మీపటలం అయ్యాయి. బాధిత కుటుంబాలను జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఆర్‌డిఓ రాజకుమారి, తహశీల్దార్ పద్మాదేవి పరామర్శించారు. ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి పక్కా గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు, బియ్యం జెసి పంపిణీ చేశారు.

'ఎయిడెడ్' సిబ్బంది గ్యాప్ అరియర్స్‌కు దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది గ్యాప్ పీరియడ్‌కు సంబంధించిన జీతాల అరియర్స్, ఇంక్రిమెంట్ దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జివో 52ను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే ఎయిడెడ్ సిబ్బందికి కూడా పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు గత నవంబర్‌లో పెంచిన విషయం తెలిసిందే. గతేడాది జనవరి నుంచి నవంబర్ వరకు 11 నెలల గ్యాప్ పీరియడ్‌కు సంబంధించిన జీతాల అరియర్స్, ఇంక్రిమెంట్ బకాయిలను పొందేందుకు ప్రభుత్వం ఈ జివో విడుదల చేసింది.

గుమడాం పరిసరాల్లో పులి సంచారం

- అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

కొద్దిరోజుల క్రితం గుమడాం సమీపంలో ఉన్న తోటలో ఆవుపై దాడి చేసి చంపేసిన పెద్దపులి అదే ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. బాగువలస దారిలో ఉన్న పామాయిల్ తోట యజమాని రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు అటవీ రేంజ్ అధికారి కె.రామారావు ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. పామాయిల్ తోటలోకి మళ్లీ పులి వచ్చిందనే అనుమానాలు యజమాని రాంప్రసాద్ వ్యక్తం చేయడంతో అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. దీని కోసం యానిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ ప్రతినిధి అమర్‌నాథ్‌ని రప్పించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సూచన మేరకు ఆవులకు వెనుక భాగంలో మార్కింగ్‌లు వేసి చూపించారు. ఆ మార్కింగ్‌ని పులి చూసి ఆవు దగ్గరకు రాదని ఆయన చెప్పారు. రాత్రి వేళల్లో బయటకు వెళ్లరాదని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పామాయిల్ తోటలో పని చేస్తున్న కూలీలు, సమీపంలో ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బిఆర్‌ఎస్ నేతల ఇళ్లపై ఐటి దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ నాయకుల ఇళ్లు, వ్యాపార కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచే సుమారు 50 ఐటి బృందాలు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇళ్లలో ఐటి అధికారులు సోదాలు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో రాత్రి పొద్దుపోయేవరకు ఐటి అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు కీలక పత్రాలు వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. కొత్తపేటలోని శేఖర్‌రెడ్డి నివాసంలో బుధవారం రాత్రి 10 గంటల వరకు సోదాలు కొనసాగాయి. హైదరాబాద్ నగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల కార్యాలయాలు, షాపింగ్ మాల్స్‌లోనూ ఐటి అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అరకు కాఫీ విక్రయశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

హైదరాబాద్ నగరంలో బుధవారం రాయదుర్గం మెట్రో స్టేషన్ పరిధిలో 'హట్ అరెబికా' (జిసిసి అరకువేలీ కాఫీ) విక్రయశాలను ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ ప్రారంభించారు. ఇతర ప్రధాన కూడళ్లలో అతి త్వరలో ఇలాంటి వాటిని పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ విక్రయశాలలో కాఫీతో పాటుగా గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి సేకరించిన తేనె, పసుపు, చింతపండు, కుంకుడుకాయలు, సీకాకాయ, ఉసిరి, కొండచీపుర్లు మొదలగు అటవీ ఫల సాయాల నుంచి తయారుచేసిన ఉత్పత్తులను కూడా నగర ప్రజలకు అందుబాటులో తీసుకువస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బుల్లితెర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం
- మోడీ ప్రభుత్వ బెదిరింపులపై ప్రజాస్వామ్యవాదుల ఆందోళన
- రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న డార్సే వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : రైతుల ఆందోళనకు సంబంధించిన కొన్ని ట్వీట్లను తొలగించని పక్షంలో ట్విట్టర్‌పై నిషేధం విధిస్తామని, ఉద్యోగుల నివాసాలపై దాడులు చేస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం బెదిరించిందంటూ ఆ సంస్థ మాజీ సిఇఓ జాక్ డార్సే చేసిన వ్యాఖ్యలు దేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ వైఖరిని ప్రజాస్వామ్య వాదులంతా ముక్తకంఠంతో నిరసిస్తున్నారు. మరోవైపు డార్సే ప్రకటనను ప్రభుత్వం తోసిపుచ్చుగా పలువురు బిజెపి నేతలు దీనిని అంతర్జాతీయ కుట్రగా అభివర్ణించారు. అయితే ట్విట్టర్ వ్యవస్థాపకుడికి అబద్ధాలు చెప్పాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేందుకు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మోడీ ప్రభుత్వం తనకున్న అధికారాలను దుర్వినియోగం చేయడాన్ని గమనిస్తే భారత ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందన్న విషయం అర్థమవుతోంది.

దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే భావ ప్రకటనా స్వేచ్ఛ అవసరం ఎంతైనా ఉంది. అది ప్రజలకు ప్రజాస్వామ్యం అందించిన పవిత్రమైన హక్కు. ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడడానికి ఇది అంకుశంలా ఉపకరిస్తుంది. తమ భావాలను వ్యక్తపరచేందుకు పౌరులకు మరింత స్వేచ్ఛ అందించి, వారికి సాధికారత కల్పిస్తుంది. వారిని ఆలోచనాపరులుగా తీర్చిదిద్ది, సమస్యలపై గళం విప్పేలా చేస్తుంది. అమెరికా రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. భారత రాజ్యాంగంలోని 19వ అధికరణలో కూడా భావ ప్రకటనా స్వేచ్ఛకు రక్షణ కల్పించారు.

హక్కును అణచివేస్తున్నారు

అయితే డార్సే చెప్పిన మాటలను పరిశీలించినా, చాలా మందికి గతంలో ఎదురైన చేదు అనుభవాలను అవలోకనం చేసుకున్నా మోడీ ప్రభుత్వం ఈ స్వేచ్ఛను ఏకపక్షంగా, ఎలాంటి సమర్ధనీయమైన హేతుబద్ధత లేకుండా అణచివేస్తోందో అర్థమవుతుంది. ప్రజల మధ్య నిర్భయంగా చర్చ జరగడానికి అవకాశం కల్పించే అత్యంత ప్రాచుర్యం పొందిన వేదికగా ట్విట్టర్ కొనసాగుతున్న కాలమిది. ఈ వేదిక పైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పకుండా నిరోధించడమంటే ఆర్టికల్ 19ని ఉల్లంఘించడమే తప్ప మరొకటి కాదు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును నిర్భీతితో వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వకుండా దేశ పౌరులను అడ్డుకోవడాన్ని చూస్తుంటే ప్రభుత్వంలో నిరంకుశత్వం రోజురోజుకూ ఎలా పెరిగిపోతోందో తెలిసిపోతుంది.

ప్రభుత్వం తనకు చట్టప్రకారం సంక్రమించిన అధికారాన్ని సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా దుర్వినియోగం చేస్తోందో డార్సే చెప్పిన మాటలను బట్టి అర్థమవుతోంది. ఈ ప్రభుత్వం చట్టాలను రూపొందించి, వాటిని అమలు చేసేది ప్రజల కోసం కాదు. ప్రజలను అణచివేసేందుకు, వారి గొంతు నొక్కేందుకు మాత్రమే చట్టాలను ప్రయోగిస్తోంది.

నేరగాళ్ల ముఠా తరహాలో...

భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విషయంలో ప్రభుత్వ స్పందనను నేరచరితుల ముఠాతో పోల్చవచ్చు. ఎలాగంటే ఈ ముఠా బలవంతంగా అధికారాలను ఉపయోగించుకొని, ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి, వారు మౌనాన్ని ఆశ్రయించేలా చేస్తుంది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలతో అనుభవాలను గురించి చెప్పమని డార్సేను అడిగినప్పుడు ఆయన నోటి నుండి వచ్చిన మొట్టమొదటి దేశం పేరు భారతదేశమే. మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని బిజెపి చెప్పుకుంటూ ఉంటుంది. అయితే అది భావ ప్రకటనా స్వేచ్ఛను ఎలా అణచివేస్తోందో ప్రపంచానికి ఇంకా తెలియదు.

దేశంలో రాజకీయ స్వేచ్ఛ కూడా అణచివేతకు గురవుతోందన్న చేదునిజం డార్సే మాటల ద్వారా సభ్య ప్రపంచానికి తెలిసిపోయింది. రాజకీయ సమీకరణ కోసం తమకున్న రాజ్యాంగపరమైన హక్కులను ఉపయోగించుకుంటున్న రైతుల ఆందోళనను పట్టించుకోవద్దంటూ ట్విట్టర్‌ను ప్రభుత్వం బెదిరించింది. దీంతో ప్రభుత్వాన్ని విమర్శించే వారి గొంతుకలు ప్రజలకు వినిపించలేదు. వారు కూడా తమ అభిప్రాయాలు సామాజిక మాధ్యమంలో పంచుకోలేకపోయారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడే. దీనిని ప్రతిఘటించేందుకు ప్రజలు, సంస్థలు ఏకమవ్వాల్సిన ఆవశ్యకత ఉంది.

జాబ్ కేలండర్ ఎక్కడ?

- అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు
- రాళ్లబూదుగూరు బహిరంగసభలో చంద్రబాబు



రాళ్లబూదుగూరు బహిరంగసభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కుప్పం, శాంతిపురం

ప్రతి ఏడాదీ జనవరిలో విడుదల చేస్తానన్న జాబ్ కేలెండర్ ఎక్కడా? అని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాబ్ రావాలంటే బాబు రావాల్సిందేనని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా చిత్తూరు జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. రాళ్లబూదుగూరు బస్టాండ్ కూడలి వద్ద సభలో చంద్రబాబు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందిస్తామన్నారు. టిడిపి హయాంలో హంద్రీనీవా జలాలను కడప ప్రజలకు ఇచ్చామని, జగన్ హయాంలో మిగిలిన పనులు ముగించి కుప్పం ప్రజలకు నీళ్లు అందించలేదని విమర్శించారు. వైసిపి నాయకులు కుప్పంలో గ్రానైట్‌ను దోచుకుంటున్నారని ఆరోపించారు. దోచుకున్నదంతా వెనక్కి రప్పించే బాధ్యత టిడిపిదేనని తెలిపారు. కుప్పంలో రౌడీ రాజ్యం నడుస్తోందని, టిడిపి శ్రేణులపై కక్ష సాధింపు చర్యలుగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే వీటన్నింటిని అరికడతామని చెప్పారు. టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాళ్లబూదుగూరును మండల కేంద్రంగా చేస్తామని తెలిపారు. మైనార్టీలకు ఇస్తున్న రంజాన్‌తోఫా, దుల్హన్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య

మరో యువతికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తేజస్విని

లండన్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. బ్రెజిల్‌కు చెందిన యువకుడు ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటన యువతి కుటుంబసభ్యులకు తీవ్ర మనోవేదనను మిగిల్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాల్టీ బ్రహ్మణపల్లికి చెందిన కొంతం శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి దంపతుల కూతురు తేజస్విని (23), కుమారుడు పవన్ కుమార్ రెడ్డి ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు ఆస్ట్రేలియాలో ప్రయివేటు ఉద్యోగం చేస్తుండగా కూతురు తేజస్విని రెడ్డి ఎంఎస్ చేయడానికి రెండున్నర సంవత్సరాల క్రితం లండన్ వెళ్లారు. లండన్‌లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశారు. ఇటీవలే స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా కొన్ని కారణాల దృష్ట్యా ఆమె రాలేకపోయారు. ఈ నేపథ్యంలో లండన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో నివసిస్తున్న ఆమెపై ఎదురు ఫ్లాట్‌కు చెందిన ఓ బ్రెజిలియన్ కత్తితో దాడి చేశాడు. దాంతో ఆమె మృతి చెందారు. అడ్డువచ్చిన జనగామకు చెందిన అఖిలకు తీవ్రగాయాలు అయ్యాయి. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే నిందితుడు ఆ అపార్ట్‌మెంట్‌లోకి వారం రోజుల క్రితమే వచ్చినట్టు తెలిసింది. కాగా, హత్య విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి కెటిఆర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. మృతదేహాన్ని త్వరలోనే తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకట రమణా రెడ్డి, తదితరులు ఉన్నారు.

డి సెట్‌లో 3,975 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఐఇడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఇ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం నిర్వహించిన డిసెట్-2023 రాతపరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు డిసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెట్‌కు మొత్తం 6,485 మంది దరఖాస్తు చేస్తే, 5,150 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 3,975 (77.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. అబ్బాయిలు 1,058 మంది దరఖాస్తు చేయగా, 837 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 712 (85.06 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. 5,427 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 4,313 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 3,263 (75.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. తెలుగు మాధ్యమానికి 2,575 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 2,043 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 1,551 (75.91 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. తెలుగు మాధ్యమంలో 73 మార్కులు సాధించిన బాలిన మాధవరావు ప్రథమ ర్యాంకు సాధించారని వివరించారు. ఇంగ్లీష్ మీడియంకు 3,213 మంది దరఖాస్తు చేయగా, 2,495 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 2,114 (84.72 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. ఇందులో 73 మార్కులు సాధించిన షేక్ ముస్తాక్ పాషా అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. ఉర్దూ మాధ్యమానికి 697 మంది దరఖాస్తు చేయగా, 612 మంది హాజరయ్యారని తెలిపారు.

విద్య, వైద్యం అందరికీ అందాలి : ఆర్.నారాయణమూర్తి

'యూనివర్సిటీ చలన చిత్రం'పై విద్యార్థులతో ఇంట్రాక్షన్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)



మాట్లాడుతున్న ఆర్ నారాయణమూర్తి

సమాజంలో మెరుగైన విద్య, వైద్యం అందరికీ అందాలని, వ్యాపారం కాకూడదని, అప్పుడే సమాజంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ప్రముఖ చలనచిత్ర నటులు ఆర్.నారాయణమూర్తి అన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో ఆయన నటించిన 'యూనివర్సిటీ చలన చిత్రం'పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, విద్యనభ్యసించిన విద్యాలయాలను జీవితంలో విద్యార్థులు మరువకూడదని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన అత్యంత ఆవశ్యకమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో ఇంగ్లీషు మీడియం పెట్టడం శుభపరిణామన్నారు. నిజజీవితంలో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఇంగ్లీషు భాష ఎంతో అవసరమని తెలిపారు. ఉన్నత విలువలతో కూడిన విద్యా బోధన నాగార్జున విశ్వవిద్యాలయంలో అందుతున్నదని, విద్యార్థులు సమాజంలో పేదరిక నిర్మూలన జరిగేలా గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేడు "యూనివర్సిటీ" అనే చలనచిత్రం అనేక సామాజిక సమకాలీన అంశాలను సమాజానికి తెలియపరిచేలా నిర్మించడం జరిగిందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే సమాజానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ నారాయణమూర్తి వెండి తెరపైనే కాకుండా సమాజంలో సైతం నిజమైన హీరో అని ప్రశంసించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తిని వర్సిటీ సిబ్బంది, విసి సన్మానించారు.

సిబిఐ ప్రవేశానికి రాష్ట్ర అనుమతి తప్పనిసరి

- స్టాలిన్ సర్కార్ కీలక నిర్ణయం

చెన్నై: సిబిఐకి సాధారణ అనుమతిని తమిళనాడు ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రాష్ట్రంలో చోటు చేసుకునే నేరాలపై ఇక నుంచి సిబిఐ నేరుగా దర్యాప్తు చేయకుండా ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో దర్యాప్తు చేసుకునేందుకు సిబిఐకి గతంలో ఇచ్చిన సాధారణ అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీంతో ఇకపై రాష్ట్రంలో ఏ కేసునైనా సిబిఐ దర్యాప్తు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. తమిళనాడు మంత్రి వి.సెంథిల్ బాలాజీని మనీలాండరింగ్ కేసులో ఇడి అరెస్టు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే స్టాలిన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

కాగా, రాష్ట్రాలు సిబిఐకి అనుమతిని నిరాకరించడం ఇదే మొదటిసారి కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగపరుస్తోందంటూ ఆరోపిస్తూ ఇప్పటికే దేశంలోని తొమ్మిది రాష్ట్రాలు సిబిఐకి సాధారణ అనుమతిని ఉపసంహరించుకున్నాయి. తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, కేరళ, ఝార్ఖండ్, పంజాబ్, మేఘాలయ, మిజోరాం రాష్ట్రాలు సిబిఐకి అనుమతిని రద్దు చేశాయి.

'భవిష్యత్‌కు గ్యారెంటీ'పై బస్సుప్రచారం

- జగన్‌కు బిజెపి అండ
- 'బిసి భరోసా' ఆవిష్కరణలో అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాష్ట్రవ్యాప్తంగా బస్సు ప్రచారం చేపట్టనున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. టిడిపి మేనిఫెస్టో ప్రచార బస్సులను ఈ నెల 19వ తేదిన పార్టీ కార్యాలయంలో చంద్రబాబు ప్రారంభిస్తారని చెప్పారు. 125 నియోజకవర్గాల్లో తిరుగుతాయని చెప్పారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో 'బిసి భరోసా' లోగోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన పథకాల్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు. జగన్ పాలనలో ప్రజలకు జరిగిన నష్టం, వారు పడుతున్న కష్టాలను తెలుసుకొని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల దిశగా ఆలోచిస్తారని పేర్కొన్నారు. జగన్ సంక్షేమం ముసుగులో ప్రజల్ని దోచేస్తూ రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. కేంద్రప్రభుత్వంతో జగన్‌కు సన్నిహిత సంబంధాలు ఉండబట్టే నాలుగేళ్లుగా అవినీతికేసుల విచారణకు కోర్టులకు వెళ్లడం లేదని విమర్శించారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ బిజెపితో తనకు, తన పార్టీకి సత్సంబంధాలున్నాయని చెప్పారని గుర్తు చేశారు. వివేకానంద రెడ్డి హత్యకేసులో అవినాష్‌ను అరెస్టు చేసేందుకు సిబిఐ వెనకడుగు వేసిందని, బిజెపి సపోర్టు లేకుండానే జరిగిందా అని ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని మించిపోయి మరీ కేంద్రం విచ్చలవిడిగా ఎపికి అప్పులిచ్చిందన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వాలని టిడిపి ప్రభుత్వం నాలుగేళ్లు మొత్తుకున్నా కేంద్రం రూపాయి ఇవ్వలేదన్నారు. టిడిపి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన నిధుల్ని జగన్ ప్రభుత్వానికి ఇచ్చారని తెలిపారు. బిజెపికి, జగన్‌కు మధ్య అండర్‌స్టాండింగ్ లేకపోతే ఇది సాధ్యమా అని ప్రశ్నించారు. జగన్‌కు మించిన అవినీతిపరుడు దేశంలోనే ఉండరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ అశోక్ బాబు, పి అనురాధ, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత ప్రాంతాలకు 50 వేల మంది తరలింపు

- నేడు తీరం దాటనున్న బిపర్‌జోయ్
- సౌరాష్ట్ర, కచ్‌లో భారీ వర్షాలు, గాలులు



గాంధీనగర్ : గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో బిపర్‌జోయ్ తుపాను తీరం దాటుందనే హెచ్చరికలతో బుధవారం సుమారు 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను తీరం దాటే సమయంలో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో బలమైన గాలులు వీయడంతో పాటు, భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. ఈ జిల్లాలకు రెడ్ ఎలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే ఈ తుపాను గుజరాత్ తీరం వైపు కదులుతుండటంతో సౌరాష్ట్ర, కచ్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తున్నాయి. బుధవారం ఉదయానికి గత 24 గంటల్లో దేవభూమి ద్వారక, జామ్‌నగర్, జునాగఢ్, పోర్‌బందర్, రాజ్‌కోట్ జిల్లాల్లోని తొమ్మిది తాలుకాల్లో 50 మీమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ బుధవారం ఉదయం ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిపై సమీక్షించారు.

ప్రస్తుతం ఉత్తర–ఈశాన్య దిశగా కదులుతున్న బిపర్‌జోయ్ గురువారం సాయంత్రానికి అత్యంత తీవ్ర తుపానుగా మారనుందని ఐఎండి తెలిపింది. గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. గురువారం తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని, తీరం సమీపించే కొద్ది భారీ వర్షాల తీవ్రత పెరుగుతుందని హెచ్చరించింది. సౌరాష్ట్ర–కచ్ ప్రాంతాల్లో ప్రధానంగా కచ్, పోర్‌బందర్, దేవభూమి ద్వారక జిల్లాల్లో బిపర్‌జోయ్ బీభత్సం సృష్టిస్తుందని హెచ్చరించింది.

తుపాను ఎదుర్కోవడానికి తీరప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన 18 బృందాలు, ఎస్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన 12 బృందాలను అధికారులు మోహరించారు. అలాగే సైన్యం, బిఎస్‌ఎఫ్, నేవీ బృందాలు కూడా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. తుపాను నేపథ్యంలో 69 రైళ్లను రద్దు చేసినట్లు పశ్చిమ రైల్వే ఇప్పటికే తెలిపింది. మరోవైపు గుజరాత్‌లో అన్ని నౌకాశ్రయాలను మూసివేయడంతో ఒక్క కచ్‌లోనే పది వేల కంటే ఎక్కువ ట్రక్కులు నిలిచిపోయాయి.

బీదర్ పాఠశాలపై దేశద్రోహం కేసు కొట్టివేత

బెంగళూరు : కర్ణాటకలోని బీదర్‌లో ఉన్న సాహీన్ పాఠశాలపై పోలీసులు నమోదు చేసిన దేశద్రోహం కేసును ఆ రాష్ట్ర హైకోర్టు బుధవారం నాడు కొట్టివేసింది. 2020లో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌర రిజిస్టరు (ఎన్‌ఆర్‌సి) నేపథ్య కథాంశాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును ఎండగడతూ ఈ పాఠశాలలో చిన్నారులు ఒక వ్యంగ్య నాటకాన్ని ప్రదర్శించిన సంగతి తెలిసిందే. 2020 జనవరి 21న పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగో తరగతి పిల్లలు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ఎన్‌ఆర్‌సి ధ్రువీకరణ కోసమంటూ తనను ఎవరైనా ఏదైనా పత్రాన్ని అడిగితే పాదరక్షలతో కొడతానని నాటకంలో పాత్రధారిగా ఉన్న ఒక బాలిక హెచ్చరిస్తుంది. భరతమాత ముద్దుబిడ్డలమైన తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకునేందుకు ప్రత్యేక డాక్యుమెంట్లేవీ చూపించనవసరం లేదని, తాము భారతీయులమని చెప్పుకోవడానికి ఎవ్వరి వద్దా ధ్రువీకరణలు పొందనవసరం తమకు లేదని ఈ నాటకంలోని ఇతర పాత్రధారులు కూడా స్పష్టం చేస్తారు. అయితే ఇందులోని కొన్ని సంభాషణలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అవమానపర్చేలా ఉన్నాయంటూ నీలేష్ రక్షయాల బీదర్‌లోని న్యూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి పాఠశాలపై ఐపిసి సెక్షన్ 124ఎ కింద దేశద్రోహం కేసు నమోదు చేశారు. దీనిపై అల్లావుద్దీన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ హేమంత్ చందన్‌గౌడర్ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. అదే ఏడాది జనవరి 30న పోలీసులు నాటకంలో పాత్రధారిగా ఉన్న బాలిక తల్లి నజ్బున్నీసాను, అలాగే నాటకానికి మార్గదర్శకం చేసిన పాఠశాల ఉపాధ్యాయులు ఫరీదా బేగంను అరెస్టు చేశారు. తర్వాత జనవరి 23న చిన్నారులను పోలీసులు యూనిఫాం దుస్తుల్లోనే విచారణ చేపట్టడం, ఆ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఆ తర్వాత జనవరి 31న పోలీసులు సాధారణ దుస్తులు ధరించి పాఠశాలకు వెళ్లి విద్యార్థులను విచారణ చేపట్టారు. మళ్లీ ఫిబ్రవరి 1న కూడా విచారణ చేపట్టారు.

దాదాపు 60 మంది చిన్నారులను విచారించారు. మళ్లీ నాలుగో దఫా ఫిబ్రవరి 3న పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పోలీసులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను విచారణ పేరుతో వేధింపులకు గురిచేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 2020 ఫిబ్రవరి 12న మడిగెరె ఎమ్మెల్యే నారాయణ జ్యోతి జవార్, మానవ హక్కుల విద్య, పర్యవేక్షణ దక్షిణ భారత సెల్ (ఎస్ఐసిహెచ్ఆర్ఇఎం) హైకోర్టులో ప్రజా ప్రయోజన ఫిర్యాదు (పిల్) దాఖలు చేశాయి. పోలీసులు ఆయుధాలు ధరించి యూనిఫాం దుస్తుల్లో విద్యార్థులను ప్రశ్నించడం జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015లోని నిబంధనలను, పిల్లల హక్కులను ఉల్లంఘించడమేనని 2021 ఆగస్టు 17న విచారణ సందర్భంగా హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజాగా వెలువరించిన తీర్పు న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత ఇనుమడింప జేసిందని సాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత అబ్దుల్ ఖదీర్ హర్షం వ్యక్తం చేశారు.



సిపిఐ కార్యాలయం వద్ద అభివాదం చేస్తున్న కేజ్రీవాల్, డి రాజా, నారాయణ

సిపిఐ నేతలతో కేజ్రీవాల్ భేటీ

న్యూఢిల్లీ : ప్రజా ప్రభుత్వ అధికారాలను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై న్యాయపోరాటానికి ఆమాద్మీ పార్టీ (ఆప్) మద్దతు సమీకరిస్తోంది. ఈ క్రమంలో బుధవారం నాడు సిపిఐ నేతలతో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమావేశమయ్యారు. ఇందుకోసం ఢిల్లీలోని సిపిఐ ప్రధానకార్యాలయానికి వెళ్లిన ఆయన సిపిఐ ప్రధానకార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శి కె నారాయణ తదితరులతో భేటీ అయ్యారు. అనంతరం ఇరు పార్టీల నేతలు సిపిఐ కార్యాలయం వెలుపుల అభివాదం చేస్తూ ఫొటోలు దిగారు. ఆప్ చేస్తున్న న్యాయపోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా డి రాజా పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తిని మోడీ సర్కార్ మంటగలుపుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు తెలిపిన సిపిఐ నేతలకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు.

సూడాన్, ఉక్రెయిన్ యుద్ధాల్లో 11 కోట్ల మంది నిర్వాసితులు

- ఐక్యరాజ్య సమితి వెల్లడి



జెనీవా : యుద్ధాలు, ఘర్షణలు, వేధింపులు లేదా మానవ హక్కుల ఉల్లంఘనల కారణంగా దాదాపు 11కోట్ల మంది తమ ఇళ్ళను వదిలి వేరే ప్రాంతాలకు తరలివెళ్లారని ఐక్యరాజ్య సమితి శరణార్థుల కమిషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) తెలిపారు. సూడాన్‌లో ఏప్రిల్ నుండి జరుగుతున్న యుద్ధం వల్ల దాదాపు 20లక్షల మంది నిర్వాసితులయ్యారు. రికార్డు స్థాయిలో శరణార్థుల సంఖ్య పెరగడానికి దారి తీసిన సంక్షోభాల్లో సూడాన్ యుద్ధం తాజాది. "మన ప్రపంచ పరిస్థితులపై ఇదొక నేరాభియోగం" అని ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ అధ్యక్షుడు ఫిలిపో గ్రాండి జెనీవాలో మీడియాతో వ్యాఖ్యానించారు. 2022 సంవత్సరానికి గాను యుఎన్‌హెచ్‌సిఆర్ అంతర్జాతీయ ధోరణులపై నివేదికను ప్రచురించడానికి ముందు ఆయన మాట్లాడారు. గత ఒక్క ఏడాదిలోనే అదనంగా కోటీ 90లక్షల మంది నిర్వాసితులయ్యారు. అమెరికా, నాటో ప్రేరేపిత ఉక్రెయిన్ యుద్ధం వల్ల కోటీ 10లక్షల మంది దాకా నిర్వాసితులయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నుండి ఇంత భారీ సంఖ్యలో ప్రజలు నిర్వాసితులైన ఉదంతమిదే. గతేడాది ఇటువంటివి 35 అత్యవసర పరిస్థితులు తలెత్తినట్లు ఆయన చెప్పారు. అంతకుముందు సంవత్సరాలతో పోల్చితే ఇది మూడు నాలుగు రెట్లు ఎక్కువ. ఇందులో మీడియాలో పతాక శీర్షికలకు ఎక్కినవి చాలా తక్కువ అని ఆయన అన్నారు. . పశ్చిమ దేశాల పౌరులను అక్కడ నుండి తరలించిన తరువాతే సూడాన్‌లో యుద్ధం లేదా ఘర్షణలు వార్త అనేక పత్రికల్లో పతాక శీర్షికల్లో వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. కాంగో, ఇథియోపియా, మయన్మార్‌ల్లో ఘర్షణలు కారణంగా గతేడాది ఒక్కొక్క దేశంలో పది లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. అంతర్జాతీయంగా ఇలా నిర్వాసితులైన వారిలో ఎక్కువ మంది తమ దేశ సరిహద్దుల్లోనే ఆశ్రయం కోరుతూ వుంటారు. మొత్తంగా నిర్వాసితులైన వారి సంఖ్యలో మూడో వంతు అంటే 3.5కోట్ల మంది ఇతర దేశాలకు పారిపోయారు. అక్కడ వారు శరణార్థులుగా మారారని యుఎన్‌హెచ్‌సిఆర్ నివేదిక పేర్కొంది. ఈ శరణార్థుల్లో అధిక శాతం మందికి ఆసియా, ఆఫ్రికా దేశాల్లోని తక్కువ నుండి ఒక మోస్తరు ఆదాయం కలిగిన దేశాలే ఆశ్రయమిచ్చాయి కానీ యూరప్ లేదా ఉత్తర అమెరికాల్లోని సంపన్న దేశాలు ఇవ్వడం లేదని గ్రాండి తెలిపారు.

ప్రస్తుతం టర్కీ అత్యధిక సంఖ్యలో 38లక్షల మందికి ఆశ్రయమిస్తోంది. వీరిలో ఎక్కువమంది సిరియన్లే వున్నారు. ఆ తర్వాత ఇరాన్ 34లక్షల మందికి ఆశ్రయమిస్తుండగా వారిలో ఆఫ్ఘన్లు ఎక్కువమంది వున్నారు. అయితే ఉక్రెయిన్ నుండి వచ్చిన 57లక్షలమంది ప్రజలు యూరప్ దేశాల్లో విస్తరించారు.

అలాగే ఏ దేశమూ లేని వారి సంఖ్య కూడా గతేడాది పెరిగి 44లక్షలకు చేరుకుందని, అయితే ఇందుకు సంబంధించిన అంచనాలు సరిగా లేవని యుఎన్‌హెచ్‌సిఆర్ డేటా తెలిపింది. వేరే దేశంలో ఆశ్రయం కోరుతూ పెట్టుకున్న దరఖాస్తుల్లో అమెరికా టాప్‌లో వుంది. గతేడాది ఇటువంటి దరఖాస్తులు 7,30,400 వచ్చాయి. అయితే ఇలా ఆశ్రయమిచ్చే వ్యవస్థ విషయంలో బాగా వెనుకబడిన దేశం కూడా అమెరికానే అని గ్రాండి పేర్కొన్నారు. ఆ వ్యవస్థను సత్వరమే సంస్కరించాల్సి వుందన్నారు. లాటిన్ అమెరికాలో ఇందుకు సంబంధించి ప్రాసెసింగ్ కేంద్రాలు పెట్టాలని భావిస్తున్నట్లు అమెరికా, స్పెయిన్, కెనడాలు ఇటీవలే ప్రకటించాయి.

జపోరిజిజియాలో భీకర పోరు

- 11 మంది మృతి

కీవ్, మాస్కో : జపోరిజిజియా, బకమత్ ప్రాంతాల్లో భీకర పోరు కొనసాగుతోంది. రష్యా బలగాలపై అమెరికా, నాటో దళాలు కవ్వింపు దాడులకు దిగడం ఉక్రెయిన్ యుద్ధంలో కొత్త దశ. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్వంత ఊరు అయిన క్రివి రిహ్‌లో ఆవాస ప్రాంతాలపై రష్యా క్షిపణులు మంగళవారం రాత్రి జరిపిన దాడిలో 11మంది మరణించారు. ఉక్రెయిన్ రిజర్వ్ సైనికులను, ఆయుధాల డంప్‌లను వెలికి తీసేందుకే తాము ఈ దాడులు జరిపామని రష్యా పేర్కొంది. రష్యా యుద్ధ వార్తలు ఇచ్చే జర్నలిస్టులతో వీడియో సమావేశంలో అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ, కుర్స్క్ ఆ చుట్టుపక్కల గల రష్యా సరిహద్దు ప్రాంతంలోని గ్రామాలపై ఉక్రెయిన్ ముసుగులో ఉన్న పశ్చిమ దేశాల దళాలు దాడి చేశాయి. ఉక్రెయిన్ దాడి చాలా పెద్ద స్థాయిలో జరిగిందని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. దాడుల్లో ఉపయోగించిన ఆయుధాలపై అమెరికా, యూరపు దేశాల ముద్రలు ఉన్నాయని ఆయన తెలిపారు. బ్రిటన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు తన ఆయుధాలను యథేచ్ఛగా సరఫరా చేస్తోంది. తమ భూభాగంపై దాడులు జరిగిన పక్షంలో వాటిని ఎదుర్కోడానికి తాము మెరుగైన రీతిలో సన్నద్ధమయ్యామని పుతిన్ చెప్పారు. ఖఖోవా డ్యామ్‌ను ఉక్రెయిన్ పేల్చివేసిన నేపథ్యంలో పరిశుద్ధమైన నీటిని పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పుతిన్ చెప్పారు. ఈ విషయంలో ఉక్రెయిన్ పరిమితమైన విజయాన్ని సాధించి, భారీగా నష్టపోయిందని పుతిన్ వ్యాఖ్యానించారు. జర్మనీకి చెందిన ట్యాంక్‌ను, అమెరికా సాయుధ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నట్లు రష్యా అధికారులు వీడియో విడుదలచేశారు.

సెంథిల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జునఖర్గే ఖండించారు. తమిళనాడులో పలుచోట్ల డిఎంకె కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు తెలంగాణలోనూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకొని ఐటి, ఇడిలు చేస్తున్న దాడులపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెదిరింపుల ద్వారా బిజెపిలోకి వలసలను ప్రోత్సహించేందుకు కేంద్ర సంస్థలను ఈ విధంగా మోడీ సర్కార్ దుర్వినియోగం చేస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 13న ఇడి రాష్ట్ర సెక్రెటేరియట్‌లోని సెంథిల్ బాలాజీ ఛాంబర్‌లు, చెన్నైలోని ఆయన బంగ్లా, కరూర్, కోయంబత్తూర్ నగరాల్లో అతనికి సంబంధించిన ఇతర ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. అయితే, బుధవారం తెల్లవారుజామున ఇడి అధికారులు మంత్రిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ సమయంలో ఆయన ఏడ్చినట్టు వీడియోలో కనబడింది. సెంథిల్ బాలాజీ తన సహాయకులు సిఫారసు చేసిన అభ్యర్థులను నియమించేందుకు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ అధికారులతో కలిసి కుట్ర పన్నారనే ఆరోపణలపై కేసు నమోదైంది. ఉద్యోగాల కోసం కోట్లాది రూపాయలు లంచం తీసుకున్నారని ఇడి ఆరోపించింది. సెంథిల్ బాలాజీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2014 నుంచి 2015 మధ్య కాలంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఆ సమయంలో ఆయన ఎఐఎడిఎంకె నాయకుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2018లో ఆయన డిఎంకెలో చేరారు.

సెంథిల్ అరెస్టు తర్వాత కరూర్ బస్టాండులో అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అరెస్టు తర్వాత ఛాతిలో అసౌకర్యంగా ఉన్నదని సెంథిల్‌బాలాజీ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను వైద్య పరీక్షల కోసం చెన్నైలోని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అడ్మిట్ అయ్యారు. అనంతరం మంత్రికి కరోనరీ యాంజియోగ్రామ్ చేయించామనీ, అందులో ఆయన ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో బాధపడుతున్నారని తేలిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు వీలైనంత త్వరగా కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేయాలని సూచించినట్టు వెల్లడించాయి. ఆస్పత్రిలో చేరిన సెంథిల్‌బాలాజీని కలవడానికి ఉదయనిధి స్టాలిన్, ఎం సుబ్రమణియన్, ఇవి వేలు, ఎస్ రేగుపతి సహా పలువురు తమిళనాడు మంత్రులు వెళ్లినా వారిని అనుమతించలేదని సమాచారం.

ఫెడరలిజంపై దాడి : స్టాలిన్

సెంథిల్‌బాలాజీని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పరామర్శించారు. బిజెపిపై ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్ర సచివాలయంలోని సెంథిల్‌బాలాజీ ఛాంబర్‌లో ఇడి సోదాలు నిర్వహించటాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ సోదాలు ఫెడరలిజం స్ఫూర్తిపై దాడిగా ఆయన అభివర్ణించారు. బిజెపి ప్రతీకార రాజకీయాల చర్యలను చూస్తున్న ప్రజల మౌనాన్ని తక్కువ అంచనా వేయకూడదన్నారు. 2024 జాతీయ ఎన్నికలు అనే తుపానుకు ముందున్న ప్రశాంతత బిజెపిని తుడిచిపెట్టేస్తుందని హెచ్చరించారు.

ప్రతికార చర్యే : ఖర్గే

డిఎంకె మిత్రపక్షం కాంగ్రెస్ సైతం మంత్రి అరెస్టును తప్పుబట్టింది. సెంథిల్ బాలాజీ అరెస్టు నరేంద్రమోడీ నేతృత్వంలోని సర్కారు చేసిన రాజకీయ వేధింపులు, ప్రతీకార చర్య తప్ప మరొకటి కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ప్రతిపక్షంలో ఉన్న తామేమీ భయపడబోమని తెలిపారు. డిఎంకె నేతృత్వంలోని అధికార కూటమి సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్.. మంత్రి అరెస్టును నిరసిస్తూ ఈనెల 16న కోయంబత్తూరులో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

సెంథిల్ అరెస్టును సిపిఎం తమిళనాడు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు కె బాలకృష్ణన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇడి ముసుగులో కేంద్ర ప్రభుత్వం వేధింపు చర్యలకు పాల్పడటం సరైంది కాదని ఆయన విమర్శించారు.



కేరళలో పెట్టుబడులకు సహకరించండి

- యుఎస్‌లో భారత రాయబారితో విజయన్ భేటీ

న్యూయార్క్ : కేరళలో మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చేందుకు దౌత్యపరంగా సహకరించాలని అమెరికాలోని భారత రాయబారి తరన్ జిత్ సింగ్ సంధును ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా భారత రాయబార కార్యాలయానికి వెళ్లి తరన్ జిత్‌తో విజయన్ భేటీ అయ్యారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో పెట్టుబడులకు అవకాశముందని ఈ సందర్భంగా తరన్ జిత్ పేర్కొన్నారు. అలాగే ఫార్మా స్యూటికల్స్, టీకాల రంగంలోనూ అవకాశాలున్నాయని, ఈ దిశగా తాము సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా ఆరోగ్య కార్యకర్తలను అమెరికాకు పంపడం, నర్సింగ్ విద్యను విస్తరింపజేయడం, ఈ దిశగా అమెరికా వైద్య విద్య సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపైనా ఇరువురు చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యాటక రంగం, మెడికల్ టూరిజం, అయుర్వేదం వంటి రంగాల్లోనూ ద్వైపాక్షిక సహకారానికి ఉన్న అవకాశాలపై సమాలోచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ ఆర్థిక మంత్రి కె బాలగోపాలన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ విపి జాయ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ పేపర్లను తొలగించొద్దు

- ఢిల్లీ వర్సిటీ విసికి ఆర్థిక అధ్యాపకుల వినతి

న్యూఢిల్లీ : జాతీయ విద్యా విధానంలో భాగంగా మూడు ఐచ్ఛిక పేపర్లను తొలగించాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఆర్థిక శాస్త్ర ఉపాధ్యాయులు వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్‌ను కోరారు. 'ఆర్థిక వ్యవస్థ–దేశం–సమాజం', ఉత్పత్తి సంబంధాలు–ప్రపంచీకరణ', 'వివక్షకు సంబంధించిన ఆర్థిక శాస్త్రం' పేరిట ఉన్న ఐచ్ఛిక పేపర్లను తొలగించాలని గత నెల 26న జరిగిన యూనివర్సిటీ విద్యా మండలి సమావేశం ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదన అసమగ్రంగా ఉన్నదని, ఈ పేపర్లను గత 40 సంవత్సరాలుగా బోధిస్తున్నామని అధ్యాపకులు తెలిపారు. ఈ పేపర్లు సమకాలీన ప్రపంచం గురించి విద్యార్థులకు లోతైన అవగాహన కలిగిస్తున్నాయని కిరోరిమాల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సౌమ్యజిత్ భట్టాచార్య చెప్పారు. ఈ పేపర్లు విద్యార్థులలో ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. వీటి ద్వారా కార్ల్ మార్క్స్ నుండి జోసెఫ్ అలోయిస్ వరకూ ఎందరో ప్రముఖుల సిద్ధాంతాలను గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారు. విద్యార్థులకు ఫోర్డ్ కార్ల గురించి బోధిస్తున్నామని, అలాంటప్పుడు ప్రముఖుల సిద్ధాంతాలను గురించి చెబితే తప్పేముందని భట్టాచార్య ప్రశ్నించారు. కాగా ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలంటూ వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు వర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు లేఖ రాశారు. దీనిపై వైస్ ఛాన్సలర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

రేపు నితీష్ కుమార్ మంత్రివర్గ విస్తరణ

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఈ నెల 16న మంత్రివర్గ పునర్వవస్థీకరణ చేపట్టనున్నారు. రాజ్‌భవన్‌లో ఉదయం 10 గంటలకు నూతన మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. జెడి(యు) ఎమ్మెల్యే, దళిత నాయుకులు రత్నేష్ సదా, మరికొంత మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) నేత, జితన్ రామ్ మాంఝీ కుమారుడు సంతోష్ సుమన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ మంత్రివర్గ విస్తరణ జరగనుంది. సుమన్ నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖను రత్నేష్ సదాకు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. సహర్సా జిల్లాలోని సోనాబర్సా నియోజకవర్గం నుంచి సదా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

జిఎం పంటలకు అనుమతి రద్దు చేయండి : బికెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : జన్యుమార్పిడి (జిఎం) పంటల పరీక్షకు, సాగు కోసం ఇచ్చిన అనుమతులను వెంటనే ఉపసంహరించుకోవాలని హర్యానాలోని బిజెపి ప్రభుత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ రైతు సంఘం భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు లేఖ రాసింది. రాష్ట్రంలో జన్యుమార్పిడి పంటలకు ముఖ్యంగా హెర్బిసిడ్ పంటల పరీక్షకు, సాగుకు హర్యానా ప్రభుత్వం అనుమతి ఇవ్వడానికి తమ సంఘం వ్యతిరేకమనిబికెఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా తెలిపారు. ఈ పంటలతో దుష్ప్రభావాలు కలుగుతున్నాయన్నారు. గతంలో తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు జిఎం పంటలకు అనుమతి నిరాకరించాయని గుర్తు చేశారు. 'జన్యుమార్పిడి పంటలు అశాస్త్రీయమైనవి. విఫలమైన సాంకేతికత అని, ఇటు వంటి పంటలు క్యాన్సర్‌కు కూడా కారణమవుతాయ'ని పేర్కొన్నారు.



సమాఖ్య స్ఫూర్తిని సమిష్టిగా రక్షించుకుందాం

- 'ఇఎంఎస్ స్మృతి' సభలో ఏచూరి పిలుపు

తిరువనంతపురం : ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు ముప్పు తెచ్చే అనేక వినాశకర విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమల్జేస్తోందని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. కేరళలోని త్రిస్సూర్‌లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ స్మారకార్థం 'ఇఎంఎస్ స్మృతి' పేరిట సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏచూరి ముఖ్య వక్తగా ప్రసంగించారు. ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రస్తుతం పొంచివున్న సవాళ్లను ఎదుర్కోవడం దేశంలోని దేశభక్తులందరి బాధ్యత అని ఏచూరి అన్నారు. సమాఖ్య స్ఫూర్తిని రక్షించుకోవడానికి ప్రజలంతా సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరముందని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంవి గోవిందన్, పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రి కె రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు ముందే కేంద్ర బలగాల మోహరింపు

- పశ్చిమ బెంగాల్ ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందుగానే రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకున్న హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో ఆ రాష్ట్ర హైకోర్టు స్పందించింది. రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారం.. వచ్చే నెల 8న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే హింసాత్మక ఘటనల దృష్ట్యా రాష్ట్రంలో కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించాలని కలకత్తా హైకోర్టు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. కాగా, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ జూన్ 9న ప్రారంభమై జూన్ 15న ముగియనున్నది.

ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో అనేక హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. ఈ నెల 11న, తూర్పు బర్ధమాన్ జిల్లాలోని బార్సుల్‌లో వామపక్ష పార్టీల మద్దతుదారులపై దాడి జరిగి హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే ఉత్తర 24 పరగణాలు జిల్లాలోని మినాఖాన్ గ్రామంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సోమ దాస్‌పై దాడి జరగటంతో ఆయన తలకు గాయమైంది. దుండగులు పార్టీ కార్యాలయం, బయట పార్క్ చేసిన పలు మోటర్‌బైక్‌లను కూడా ధ్వంసం చేశారు. అలాగే, నాడియా జిల్లా, ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని నకాషిపరా వద్ద కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు లక్ష్యంగా చేసుకొని దాడులు జరిగాయని వార్తలు వచ్చాయి. ఇలా ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు జరగటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ నేపథ్యంలో కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టిఎస్ శివజ్ఞాన్, న్యాయమూర్తి హిరణ్మయ్ భట్టాచార్యలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రతిపక్ష నాయకులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించింది. కేంద్ర బలగాలను మోహరించాలని ఈసీకి రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణలో భాగంగా ఎన్నికల సంఘం సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన జిల్లాలు, ప్రాంతాలలో కేంద్ర బలగాలను మోహరించాలని కోర్టు ఆదేశించింది. అన్ని పోలింగ్ బూత్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని వెల్లడించింది. అయితే, నామినేషన్ల దాఖలుకు సమయాన్ని పొడిగించాలన్న అభ్యర్థనను పరిశీలించడానికి మాత్రం హైకోర్టు నిరాకరించింది. దానిని ఎన్నికల సంఘం విచక్షణకు వదిలివేసినట్టు తెలిపింది.

రెజ్లర్లకు మద్దతుగా రైతన్నల సమరభేరి

- బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకపోతే ఢిల్లీకి పాలు, నీళ్లు కట్
- 18న భారత్ బంద్
- ఖాప్ పంచాయతీల తీర్మానం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై న్యాయ పోరాటం సాగిస్తున్న దిగ్గజ రెజ్లర్లకు మద్దతుగా అన్నదాతలు సమరభేరి మోగించారు. కీచక బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ హర్యానాలోని ఖాప్ పంచాయితీలు బుధవారం బంద్ నిర్వహించాయి. ఢిల్లీ–హర్యానా జాతీయ రహదారిని దిగ్బందించాయి. ఈ బంద్‌కు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చాయి. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకుంటే ఢిల్లీకి పాలు, నీళ్లు నిలిపేస్తామని ఖాప్ పంచాయతీలు హెచ్చరించాయి. కేంద్రం ప్రభుత్వం తన మొండి వైఖరి వీడకపోతే ఈ నెల 18న భారత్ బంద్ చేపట్టనున్నట్లు పేర్కొన్నాయి. ఇందుకోసం ఇతర రాష్ట్రాల రైతు సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు 21 మంది సభ్యులతో సన్నాహక కమిటీని ఏర్పాటు చేశారు. దీనితో పాటు, ఇతర రాష్ట్రాల వ్యాపార బోర్డులు, రాజకీయ పార్టీలు, ఖాప్‌ల ప్రతినిధులతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ అరెస్టు, రైల్ కారిడార్‌కు పరిహారం, రుణమాఫీతో పాటు తదితర అంశాలతో కూడిన 25 అంశాల చార్టర్‌ను ఖాప్ పంచాయితీల సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ అన్ని అంశాలపై ప్రభుత్వంతో చర్చలు జరిపే బాధ్యతను కూడా ఈ 21 మంది సభ్యుల కమిటీకి అప్పగించారు.

బ్రిజ్‌నే కాదు..ఆయన కుటుంబ సభ్యులనూ అనుమతించరాదు

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నలుగురు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ జనరల్, ట్రెజరర్, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు, ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్ల స్థానాలకు జూలై 6న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను, సన్నిహితులను కూడా పోటీ చేసేందుకు అనుమతించరాదని రెజ్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వద్ద లేవనెత్తిన డిమాండ్లలో ఇది కూడా ప్రధానమైనది. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్‌కు నాయకత్వం వహిస్తుండగా, అతని అల్లుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ బీహార్ యూనిట్‌కు అధిపతిగా ఉన్నారు. రెజ్లర్ల డిమాండ్ నేపథ్యంలో బ్రిజ్ కుమారుడు కరణ్, అల్లుడు ఆదిత్య డబ్ల్యుఎఫ్ఐ ఎన్నికలకు నామినేషన్లు వేయకూడదని నిర్ణయించుకున్నట్లు సింగ్ సన్నిహితులు తెలిపారు.

మణిపూర్‌లో ఆగని హింస

- మరో 11 మంది మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ కొనసాగుతూనే ఉంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకూ చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని కాంగ్‌కోపీ జిల్లా ఐజిజంగ్ గ్రామంలో కాల్పులు, గృహదహనాలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీల జనాభా అధికంగా ఉన్న ఈ గ్రామంలో రాత్రి 10.30 గంటలకు హింస చెలరేగింది. చనిపోయిన వారందరూ మైతీ తెగ వారే. వీరంతా స్థానిక వాలంటీర్లని పోలీసులు తెలిపారు. కాంగ్‌కోపీ, తూర్పు ఇంఫాల్ జిల్లాల సరిహద్దులో ఈ గ్రామం ఉంది. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్కడ తమ వారు నివసిస్తున్న ప్రదేశాలను కాపాడుకునేందుకు సమీప ప్రాంతాలకు చెందిన మైతీలు అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. గాయపడిన పది మందిని ఆస్పత్రిలో చేర్చగా వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం కుకీ తెగకు చెందిన వారు మంగళవారం రాత్రి ఖామెన్‌లాక్‌లో బాంబులు విసిరారు. ఈ ప్రాంతంలోనే కుకీలు, మైతీల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా జరుగుతున్న వేర్వేరు ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. రెండు తెగల వారు అత్యాధునిక ఆయుధాలతో ఒకరిపై ఒకరు కాల్పులకు తెగబడుతున్నారు. ఈ నెల 3న ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి 115 మంది చనిపోగా 40 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. మైతీలు తమకు ఎస్టీ హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా గిరిజనులైన కుకీలు దానిని వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.



మీ కోసం
ఇడ్లీ పిండిలో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరినూనె కలిపితే ఇడ్లీలు బాగా మెత్తగా వస్తాయి.

జీవన సౌరభం
ఎదుటివారి ఆలోచనలను గౌరవించకపోయినా ఫరవాలేదు.. అవహేళన మాత్రం చేయకూడదు.

పుస్తకం విలువ



చిట్టి, చిన్ని, మున్ని కలిసి తాతయ్య దగ్గరకు వెళ్లి 'తాతయ్యా నువ్వు ఎందుకు ఎప్పుడూ చేతిలో ఏదో ఒక పుస్తకం పట్టుకొని వుంటావు? దాని వల్ల ఉపయోగం ఏంటి? అస్తమానం పుస్తకం పట్టుకొని తిరిగితే నీకు విసుగు రాదా...?' అని అడిగారు.

'లేదు.. పిల్లలూ, నిజానికి పుస్తకం నా చేతిలో ఉంటేనే నాకు సంతృప్తిగా ఉంటుంది. గౌరవ మర్యాదలు కూడా దొరుకుతాయి' అని బదులిచ్చాడు తాతయ్య.


'పుస్తకం వల్ల విజ్ఞానం, వివేకం, వినోదం కలుగుతుందని విన్నాం కానీ పుస్తకం చేతిలో ఉంటే గౌరవం ఎలా పెరుగుతుంది? అది మేమెప్పుడూ వినలేదే...!' అని అన్నది చిట్టి.

'మాకు నమ్మకం లేదు' అని చిన్న నవ్వు నవ్వారు చిన్ని, మున్నీ.

"అయితే రచ్చబండ వద్దకు వెళ్దాం పదండి. ఈ పుస్తకం విలువ ఏంటో మీకు అర్థం అవుతుంది." అని పిల్లల్ని రచ్చబండ వద్దకు తీసుకొని వెళ్ళాడు తాతయ్య.

అక్కడ తాతయ్య కన్నా పెద్దవాళ్లు, చిన్న వాళ్లువున్నారు. వాళ్లు తాతయ్య చూడగానే నిలబడి నమస్కరించారు. "రండి రండి... ఈ రోజు కొత్త పుస్తకాన్ని తెచ్చినట్లు వున్నారు. అందులో ఉన్న మంచి విషయాలను చెప్పండి. మీ చేతిలో పుస్తకం చూస్తే మాకు ఆనందంగా ఉంటుంది." అని అన్నారు. అది చూసి పిల్లలు ఆశ్చర్యపోయారు. అప్పుడు అర్థమయ్యింది, పుస్తకం విలువ. పుస్తకాలు చదివితే జ్ఞానం మాత్రమే కాదు; గౌరవ, మర్యాదలు కూడా పొందవచ్చునుకున్నారు.


- ఎం వి స్వామి
94415 71505



చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ





- శిరసనం బాటి సౌర్య,
4 వ తరగతి,
నలందా విద్యానికేతన్ స్కూలు,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్వతంత్రంగా బతకడం నేర్చుకో...

'ముగ్గురూ ఆడపిల్లలే.. జాగ్రత్తగా ఉండండి.. త్వరగా పెళ్లిళ్లు చేసి పంపండి' అన్న మాటలు వింటూ పెరిగిన ఆమె పేరు ప్రీతీ విశ్వకర్మ. ముంబయిలో పుట్టి పెరిగిన ప్రీతీ ఆ ముగ్గురు ఆడ పిల్లల్లో ఆఖరిది. బంధువులు, ఇరుగుపొరుగు వారు సూటిపోటు మాటలు అన్న ప్రతిసారీ "ఆడపిల్లలను కలిగిఉండం వల్ల మాకు బాధగా లేదు.. ఎంతో గర్వంగా ఉంద"న్న తల్లిదండ్రుల మాటలు ఆమెలో ఎక్కడ లేని ధైర్యాన్ని నింపేవి. అందుకే ఎంతటి ప్రతికూల పరిస్థితులోనైనా తనను తాను నిరూపించుకుంటూ ముందుకెళు తోంది.

'పెళ్లి చేసుకోవడం మీ లక్ష్యం కాదు.. స్వతంత్రంగా బతకడమే మీ ధ్యేయంగా ఉండాలి' అని నాన్న మాతో పదే పదే చెప్పేవారు. అమ్మానాన్న మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. మేము ఉన్నత శిఖరాలవైపు ప్రయాణించేలా చేయడంలో వారి కృషి ఎంతో ఉంది' అంటున్న ప్రీతీకి కళారంగంపై ఉన్న మక్కువతో టెలివిజన్ ప్రొడక్షన్ కోర్సు చేసి ప్రముఖ టీవీ కంపెనీలో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా వివిధ చిత్రనిర్మాణాల్లో పాల్గొన్నారు.



'ఈ రంగంలో ఉండడం వల్ల అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ఏ టైమ్‌కి పడితే ఆ టైమ్‌కి స్టూడియోకి వెళ్లడం, రావడం చేసేదాన్ని. అర్ధరాత్రి 2 గంటలకు వచ్చి ఉదయం 5 గంటలకే వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఈ పనిగంటలు నా ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. 16 ఏళ్లప్పుడు నాకు మూర్ఛవ్యాధి సోకింది. అప్పుడు కూడా అమ్మానాన్న నాకు అండగా నిలబడ్డారు. నాలో లేనిపోని భయాలు కలగకుండా ధైర్యంగా ఉండమనేవారు.

ట్రావెలర్.. జీవితంలో కొత్త దారి

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రీతీ విశ్రాంతి కోసం ఏదైనా ట్రిప్ చేయాలనుకున్నారు. అలా మొదటిసారి ఉత్తరాఖండ్ వెళ్లాలని నిశ్చయించుకున్నారు. 'ఈ ట్రిప్‌కి మా ఫ్రెండ్స్‌ని రమ్మన్నాను. కాని ఉత్తర భారతదేశ ప్రయాణం ఆడపిల్లలకు అంత శ్రేయస్కరం కాదని వారు రానన్నారు. కానీ నా నిర్ణయం మార్చుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే నాన్నకు అబద్ధం చెప్పి ఒక్కదాన్నే ట్రిప్‌కు బయలుదేరాను' అంటున్న ప్రీతీ 23 ఏళ్ల వయసులో మొదటిసారి ముంబయి నుండి బయటికి వచ్చింది.

'ముంబయి నుండి ఛండీగఢ్‌కు రైలులో ప్రయాణించాను. రాత్రి 10 గంటలకు రైలు దిగితే 11 గంటలకు ధర్మశాలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. ఆ గంట స్టేషనులో ఉండేందుకు చాలా భయమేసింది. కానీ అక్కడ నాతోపాటు మరో విదేశీ మహిళ కూడా ఉంది. ఆమెను చూసి నాకు చాలా ధైర్యమనిపించింది. ఎవరో పరాయి దేశ మహిళ ఇంత ధైర్యంగా ఉంటే.. నా సొంత దేశంలో నేనెందుకు భయపడుతున్నాను అనిపించి గుండెనిబ్బరంగా అక్కడే నుంచొన్నాను. అయితే ఆ భయం వెనుక నాలో ఏదో అసంతృప్తి. నాన్నకు అబద్ధం చెప్పి వచ్చాను కదా! అందుకే ట్రిప్ ముగించుకుని వెళ్లగానే నాన్నకు నిజం చెప్పేసి క్షమించమని కోరాను. అప్పుడు 'జాగ్రత్తగా ఉండు.. నీపై నాకు, అమ్మకు చాలా నమ్మకం' అని నాన్న చెప్పిన మాటలు నాలో మరింత ధైర్యాన్ని నింపాయి'.

వెనుదిరిగి చూడలేదు..

ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకున్నంత కాలం అమ్మానాన్న ఇచ్చిన ధైర్యం వెలకట్టలేనిది. వారు చెప్పిన మాటలే నా జీవితాన్ని మరో దిశలో నడిపించాయి. అలా 2014లో ఒంటరిగా మొదలుపెట్టిన నా ప్రయాణం ఇప్పటివరకు ఆగలేదు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ వంటి ఉత్తరభారత రాష్ట్రాలన్నీ ప్రయాణించేశాను. ఈ ప్రయాణాల్లో నేను పొందిన సంతోషం దేనిలోనూ కలగలేదు. అందుకే చేస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెప్పి పూర్తి సమయమంతా ట్రావెలర్‌గానే ఉండిపోయాను' అంటున్న ప్రీతి ఆ తరువాత కాలంలో వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల మహిళల కోసం ఓ ట్రావెలర్ గ్రూపు ప్రారంభించారు.

50, 60 ఏళ్ల మహిళల కోసం..

'మహిళలు చాలా ఏళ్ల పాటు కుటుంబానికే అంకితమవుతారు. వృద్ధాప్యం వచ్చాక విరామం వచ్చినా ఏదైనా ప్రయాణం చేయాలంటే సహకారం వుండదు. అటువంటి వారందరినీ నా గ్రూపులో



చేర్చుకున్నాను. నా గ్రూపులో ఇప్పుడు 18 ఏళ్ల నుండి 65 ఏళ్ల వయసు వారు ఉన్నారు. ఒకరికొకరు ఏ పరిచయం లేకపోయినా మేమంతా ఒకే కుటుంబంలా ఉంటాం. కొండలెక్కుతాం.. పర్వతాలు అధిరోహిస్తాం. 'వరుసగా ఆడ పిల్లలు పుట్టారు..' అని విచారం చేసిన బంధువులంతా ఇప్పుడు నా గ్రూప్‌లో చేరి నాతో పాటు ప్రయాణిస్తుంటే చెప్పలేని సంతోషమేస్తోంది. వారిని చూసినప్పుడల్లా.. స్వతంత్రంగా జీవించడం ముఖ్యమ'ని నాన్న చెప్పిన మాటలు గుర్తుకొస్తుంటాయి.

కొత్త స్నేహితులతో ఇలా మెలగాలి ...

పిల్లలు కొత్త స్కూళ్లలోకి, కొత్త తరగతుల్లోకి మారే సమయం ఇది. ఇప్పడే కొత్త స్నేహితులూ పరిచయం అవుతారు. వారితో స్నేహం ఏర్పడితే ప్రతిరోజూ స్కూలుకు వెళ్లాలనిపిస్తుంది. స్కూల్లో ఎంతమంది స్నేహితులు దొరికితే క్లాస్ వాతావరణం అంత బాగుంటుంది. పాఠాలు కూడా ఆసక్తిగా వింటారు. అందుకు తల్లిదండ్రులే పిల్లలకు మానసికంగా తయారుచేయాలి.

- పాత స్కూలు, పాత స్నేహితులు ఉండరని బెంగపడకుండా ముందుగానే వారిలో ఉత్సాహం కలిగించేలా మాటలు చెప్పాలి.
- కొత్తవాళ్లను చిరునవ్వుతో పలకరిస్తే ఎవరైనా సరే మాట్లాడేందుకు ఆసక్తి చూపిస్తారు. కొత్త పిల్లలతో మాట్లాడేటప్పుడు చిన్న నవ్వు నవ్వితే స్నేహానికి మొదటి అడుగులా ఉంటుంది.
- తెలియని వారు, కొత్త పిల్లలు అని వారి పక్కన కూర్చోకుండా దూరంగా వెళ్లకూడదు. మొదట పరిచయం చేసుకునేటప్పుడు తప్పకుండా 'హాయ్' లేదా 'హలో' లాంటి పదాలు అనడం వల్ల ఎదుటివారిలో స్నేహపూర్వక అనుబంధానికి బీజం పడుతుంది. క్లాసులో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది.
- స్నేహం ఏర్పడుతున్న మొదట్లో ఎదుటవారు ఏం చెబుతున్నారో పూర్తిగా వినాలి. ఆ తర్వాతే మాట్లాడాలి.
- కొత్త స్నేమితులతో కలిసి ఆటల్లో పాల్గొనమని చెప్పండి. ఓడినా...గెలిచినా స్ఫూర్తిగా తీసుకోమని చెప్పాలి.
- పిల్లల ప్రవర్తన నచ్చి కొంత సమయంలోనే స్నేహితులవుతారు. వారిలో సున్నిత మనస్కులు, అల్లరి పిల్లలూ ఉంటారు. టీంగా ఏర్పడినప్పుడు కొన్ని పొరపాట్లు, తప్పులు జరుగుతాయి. అయినా నొప్పించేట్లు మాటలు తూలకూడదు. దూరం పెట్టకూడదు. కలిసిమెలిసి ఉండాలని చెప్పాలి.



శ్రీలీల పుట్టినరోజు కానుకలు

హీరోయిన్ శ్రీలీల తన డ్యాన్స్‌తో యూత్‌ని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అర డజను సినిమాల్లో 'గుంటూరు కారం' ఒకటి. మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. బుధవారం శ్రీలీల బర్త్ డే సందర్భంగా సినిమాలో ఆమె ఫస్టలుక్ పోస్టర్ విడుదలైంది. లంగా ఓణీలో అచ్చు పల్లెటూరి అమ్మాయిలా శ్రీలీల పోస్టర్ ఆకట్టుకుంటుంది. సినిమాలో శ్రీలీల పాత్ర కూడా కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు మహేష్-శ్రీలీల మధ్య మాస్ బీట్‌ను ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీలీల.. నవీన్ పోలిశెట్టితో 'అనగనగా ఒక రాజు', బోయపాటి-రామ్ పోతినేని మూవీలో, బాలయ్య భగవంత్ కేసరి సినిమాలతో పాటు గాలి కిరిటీ డెబ్యూ మూవీలోనూ హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉన్నారు.

అల్లు అర్జున్‌తో స్టెప్‌లేస్తూ.. హీరోయిన్ శ్రీలీల, ఊర మాస్, స్టైలిష్ డ్యాన్సర్ హీరో అల్లు అర్జున్‌తో కలిసి డ్యాన్స్ చేస్తున్న పోస్టర్‌ను షేర్ చేశారు ఆహా ఎంటర్‌టైన్‌మెంట్ టీం. బుధవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ ఫోటోను షేర్ చేస్తూ... వీళ్లు కలిసి స్టెప్పేస్తే బొమ్మ బ్లాక్ బస్టరే.. అతిపెద్ద మూవీ పండుగ చేసుకుందామా.. గెట్ రెడీ ఫర్ ఎంటర్‌టైన్‌మెంట్ సునామి.. అంటూ అప్‌డేట్ అందించారు. త్వరలోనే ఈ కమర్షియల్ విడుదల కానుందని క్లూ ఇచ్చారు.

ఉస్తాద్ భగత్ సింగ్‌లో.. పవన్‌కళ్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్', హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. చిత్రంలో ఆమె లుక్ విడుదల చేశారు మేకర్స్.






'ఈ నగరానికి ఏమైంది' రీ రిలీజ్

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమతం, వెంకటేష్, కాకమను, అనీష, సిమ్రాన్ చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం రీ రిలీజ్‌కి సిద్ధమైంది. జూన్ 29, 2018లో థియేటర్లలో విడుదల అయిన ఈ సినిమా ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా అయిదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రీ రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ నెల 29వ తేదీన ఈ సినిమా మళ్ళీ థియేటర్లలో విడుదల కానుంది. సురేష్ ప్రొడక్షన్స్ పై సురేష్ బాబు నిర్మించిన ఈ సినిమాకి వివేక్ సాగర్ సంగీతం అందించారు.

విజయ్, పరశురాం కాంబోలో ...



దర్శకుడు పరశురాం, విజయ్ దేవరకొండతో కలిసి గీతగోవిందం తీశారు. ఇప్పుడు వీరి కాంబోలో మరో కొత్త సినిమా రానుంది. పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరా స్విచ్చాన్ చేయగా.. హీరోహీరోయిన్లపై నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టారు. ముహూర్తపు సన్నివేశానికి గోవర్ధనరావు దేవరకొండ గౌరవ దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే షురూ కానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా 'విడి13'గా రాబోతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



ఒకేసారి రెండు భాషల్లో 'దృశ్యం-3'

మోహన్ లాల్ హీరోగా జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన 'దృశ్యం' సీక్వెల్‌పై తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. మలయాళంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి పార్ట్ థియేటర్లలో విడుదల చేశారు. కోవిడ్ కారణాలతో రెండోపార్ట్‌ని ఓటీటీలో విడుదలచేశారు. అయితే ఈ పార్ట్-2 ని హిందీలో రీమేక్ చేసి రిలీజ్ చేయగా థియేట్రికల్‌గా ఈ సినిమాకి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఇప్పుడు 'దృశ్యం 3'ని మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కించనున్నట్లుగా తాజా సమాచార. మొదటి, రెండు సినిమాల్లో నటించిన హీరోలతోనే తెరకెక్కిస్తారా లేదా అనే విషయంలో స్పష్టత రానప్పటికీ ఈ చిత్ర షూటింగ్ వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుందని స్పష్టమైంది.



'అవతార్' సీక్వెల్స్ వాయిదా

జేమ్స్ కేమరూన్ తెరకెక్కించిన 'అవతార్' చిత్ర తాజా సీక్వెల్ ఇటీవల విడుదలైంది. ఇంకా మూడు సీక్వెల్స్ రానున్నట్లు వాటి విడుదల తేదీలు కూడా గతంలో ప్రకటించారు. తాజాగా ఆ తేదీలు వాయిదాపడినట్లు మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం మూడు సినిమాల కొత్త డేట్స్ ఇలా ఉన్నాయి. అవతార్ 3, 2025 డిసెంబర్ 19, అవతార్ 4 డిసెంబర్ 21, 2029. అలాగే అవతార్ 5 చిత్రం 2031 డిసెంబర్ 19న రిలీజ్ చేస్తున్నట్టుగా డిస్నీ సంస్థ కన్ఫర్మ్ చేసింది.

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ పెంపు



మొత్తం రూ.465కోట్లు, సింగిల్స్ విజేతకు రూ.24.44కోట్లు

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆటగాళ్లకిచ్చే ప్రైజ్ మనీ మరోసారి భారీ పెరిగింది. గత ఏడాదితో ఈసారి ఆటగాళ్లకిచ్చే ప్రైజ్‌మనీని 11.2 శాతం పెంపుదల చేస్తున్నట్లు ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ అండ్ క్రోకెట్ క్లబ్(ఎఇఎల్‌టిసి) నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో ఈ ఏడాది మొత్తం 44.7మిలియన్ పౌండ్స్ (రూ.465కోట్లు) ప్రైజ్ మనీని అందజేయనున్నారు. సింగిల్స్ విజేత 2.35 మిలియన్ పౌండ్స్ (రూ.24.44కోట్లు), రన్నరప్‌కు 1.17 మిలియన్ పౌండ్స్(రూ.12.22కోట్లు) ప్రైజ్ మనీ అందుకోనున్నారు. ఇది గత ఏడాదితో పోల్చిచూస్తే 1.7మిలియన్ పౌండ్స్, అంతకుముందు ఏడాదితో పోల్చిచూస్తే 2మిలియన్స్ పౌండ్స్ అధికం. అలాగే పురుషుల, మహిళల డబుల్స్ విజేతలకు అందజేసే ప్రైజ్ మనీని 10.7 శాతం పెంపుదల చేశారు. వీల్‌ఛైర్ మరియు క్వాడ్ వీల్‌ఛైర్ సింగిల్స్, డబుల్స్ విజేతలకు అందజేసే ప్రైజ్ మనీని 20శాతం పెంపుదల చేశారు. 2019లో తొలిసారి ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంచిన నిర్వాహకులు తాజాగా మరోసారి భారీగా ప్రైజ్ మనీని పెంపుదల చేశారు. అలాగే క్వాలిఫయింగ్ టోర్నీలో ఆటగాళ్లకిచ్చే ప్రైజ్ మనీలోనూ 14.5శాతం పెంపుదల కనిపించింది. ఇక మొయిన్ డ్రా తొలిరౌండ్ విజేత 10శాతం పెంపుదలతో 55వేల పౌండ్స్ (రూ. 57 లక్షలు) అందుకోనున్నాడు. గత ఏడాది తొలిరౌండ్ విజేతకు 10.7శాతం ప్రైజ్ మనీ దక్కితే.. అది ఈసారి 20శాతానికి పెరిగింది. ఈ మేరకు ఆల్ ఇంగ్లండ్ క్లమ్ ఛైర్మన్ ఇవాన్ హెవిట్ అధికారికంగా ప్రైజ్ మనీ పెంపుదల విషయాన్ని వెల్లడించారు.

టాప్‌లో అశ్విన్

రహానే, శార్దూల్‌కు చోటు..

ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరోసారి టాప్ లేపాడు. అలాగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లో మెరుగైన ఆటను ప్రదర్శించిన అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్‌లు ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. రహానే 37వ స్థానంలో, శార్దూల్ 94వ స్థానంలో ఉన్నారు. డబ్ల్యుటిసి ఫైనల్లో రహానే 89, 46 రన్స్ చేయగా, శార్దూల్ కీలకమైన హాఫ్ సెంచరీ చేశాడు. ఇక టెస్టు బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ టాప్ బౌలర్‌గా నిలిచారు. ఆస్ట్రేలియాకు చెందిన ముగ్గురు బ్యాటర్లు టాప్ ప్లేస్ కొట్టేవారు. ఆ జాబితాలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్ ఉన్నారు. గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషబ్ పంత్ మాత్రం ర్యాంకింగ్స్ లిస్టులో టాప్‌లో ఉన్నారు. పంత్ పదో ర్యాంక్‌లో ఉండగా, రోహిత్.. కోహ్లీలు 12, 13వ స్థానాల్లో ఉన్నారు. బ్యాటింగ్‌లో 903 రేటింగ్ పాయింట్లతో లబుషేన్ తొలిస్థానంలో ఉన్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో 121, 34 రన్స్ కొట్టిన స్మిత్(885) రెండో స్థానాన్ని ఆక్రమించాడు. ఇక మరో సెంచరీ హీరో ట్రావిస్ హెడ్(884) మూడో స్థానంలో ఉన్నాడు. ముగ్గురు టాప్ బ్యాటర్లు ఒకే దేశానికి చెంది ఉండడం చాలా అరుదు. గతంలో 1984లో ఒకసారి ఇలా జరిగింది. విండీస్ ప్లేయర్లు గ్రీనిడ్జ్, క్లైవ్ లాయిడ్, లారీ గోమ్స్‌లు టాప్ ప్లేస్ కొట్టేశారు.



ప్రిక్వార్టర్స్‌కు శ్రీకాంత్, లక్ష్యసేన్

ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

జకార్తా : ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-17, 21-13తో అమెరికాకు చెందిన 8వ సీడ్ లీ-జి-జియావో పై, కిదాంబి శ్రీకాంత్ 21-13, 21-19తో చైనాకు చెందిన లూ-జంగ్-జూ(చైనా)పై వరుససెట్లలో గెలిచారు. ఇక మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 10-21, 4-21తో 2వ సీడ్ కొరియాకు చెందిన అన్-సే-యంగ్ చేతిలో చిత్తుగా ఓడగా.. మరో పోటీలో ప్రియాంశు రాజ్‌వత్‌కు తొలిరౌండ్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి 3వ సీడ్ విదిత్‌శరణ్(థాయ్‌లాండ్) తొలి మ్యాచ్ ఆడకుండా వైదొలిగాడు.



న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ

వన్డే ప్రపంచకప్‌కు బ్రేస్‌వెల్ దూరం?

లండన్: న్యూజిల్యాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ వన్డే ప్రపంచకప్‌కు దూరం కానున్నాడు. ఇంగ్లండ్ కౌంటీల్లో వార్సెస్టర్‌షైర్ తరపున ఆడుతున్న బ్రేస్‌వెల్.. యార్క్‌షైర్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తీవ్రంగా గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత పరీక్షల్లో అతని కుడి కాలి మడమ దగ్గర తీవ్రమైన గాయమైనట్లు తేలింది. దీంతో ఈ 32ఏళ్ల ఆల్‌రౌండర్‌కు ఇంగ్లండ్‌లోనే శస్త్రచికిత్స చేయనున్నారు. ఈ ఆపరేషన్ తర్వాత కనీసం రెండు వారాల విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందట. అనంతరం స్వదేశం వెళ్లిపోనున్న బ్రేస్‌వెల్.. అక్కడ ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్ కప్‌లో అతను ఆడటం జరగదు.



పరీక్ష పాస్‌వర్డ్‌ను విడుదల చేస్తున్న ఎయు అధికారులు

ఎపి ఎడ్‌సెట్ ప్రశాంతం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్తంగా బిఇడి కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన ఎపి ఎడ్‌సెట్-2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 13,672 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 11,235 (82.17 శాతం) మంది హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 77 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష సాగింది. పరీక్ష పాస్‌వర్డ్‌ను ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షా కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిపురుష్' టికెట్ రేట్ల పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభాస్, కృతీసనన్ జంటగా భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఆదిపురుష్ సినిమాకు టికెట్ రేట్ల పెంపునకు, అదనపు షోలను వేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిపురుష్ సినిమా ఈ నెల 16న థియేటర్లలో విడుదలకు నిర్మాణ సంస్థలు నిర్ణయించాయి. ఆదిపురుష్ చిత్ర యూనిట్ విజ్ఞప్తి మేరకు సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతులిస్తూ.. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్త ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని థియేటర్స్‌లోనూ ప్రతి టికెట్‌కు అదనంగా రూ.50 పెంచుకునేలా పదిరోజులపాటు వెసులుబాటు కల్పించారు. రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

- ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బిసిలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. విజయవాడలో వైసిపి బిసిల సదస్సును బుధవారం నిర్వహించింది. ఈ సదస్సులో ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. పార్లమెంటులోనూ వైసిపి ఎంపిలు బిసిల చట్టబద్ధ హక్కుల కోసం కృషి చేస్తున్నారన్నారు. జగన్‌కు బిసిలంతా అండగా నిలవాలని కోరారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

- శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీడికి మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద బుధవారం వామపక్షాల నాయకులు ధర్నా చేపట్టారు. జీడి పిక్కలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని జీడికి మద్దతు ధర ప్రకటించకపోతే ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్రంలోని బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు జీడిపిక్కలకు మద్దతు ధర ఎందుకు ప్రకటించడం లేదని, రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే జిల్లా మంత్రులకుగానీ, స్పీకర్‌కుగానీ పట్టకపోవడం శోచనీయమన్నారు. ఒకవైపు జీడిపిక్కల ధర తగ్గించి, మరోవైపు జీడిపప్పుకు ధర పెంచడంతో ఇటు రైతాంగం అటు వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పండించిన జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని, కేరళ మాదిరిగా రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న వామపక్షాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి మాధవరావు, లిబరేషన్ నాయకులు ఎం రామారావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ టి అజయ్ కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో జీడి పిక్కలను ప్రదర్శిస్తున్న రైతులు

జిఎస్‌డిపిలో 10 శాతానికే గ్యారంటీలు

- ఐదేళ్లలో ఐదు శాతానికి తగ్గించాలి
- కేంద్ర వర్కింగ్ గ్రూప్ డ్రాఫ్ట్ నివేదిక వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్యారంటీలపై ఇక కఠిన విధానాలు అమలు కాబోతున్నాయి. ఈ మేరకు గ్యారంటీలపై కేంద్రం ఏర్పాటుచేసిన వర్కింగ్ గ్రూప్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటికి సంబంధించిన డ్రాఫ్ట్ నివేదిక కూడా సిద్ధమైంది. ఈ గ్రూపులో అన్ని రాష్ట్రాల ఆర్థికశాఖ అధికారులు కూడా ఉండడం గమనార్హం. ఈ చర్చల్లో పలు అంశాలను అనేక రాష్ట్రాల అధికారులు కూడా లాంఛనంగా ఆమోదించగా, మరికొన్ని అంశాలపై పలు రాష్ట్రాలు విభేదించాయి. చివరకు మొత్తంగా తయారుచేసిన డ్రాఫ్ట్ నివేదికను అన్ని రాష్ట్రాలకు పంపించి తుది ఆమోదాన్ని పొందాలని కేంద్రం నిర్ణయించింది.

ప్రధానంగా పలు సంస్థలకు ఇచ్చే గ్యారంటీలు ఏడాదికి జిఎస్‌డిపిలో 10 శాతం కన్నా దాటకూడదని నిర్ణయించారు. అలాగే ఈ గ్యారంటీలు తదుపరి ఐదేళ్లలో ఐదు శాతానికి తగ్గించాలని కూడా గ్రూపు సమావేశంలో నిర్ణయించారు. ఇదే సమయంలో మొత్తం గ్యారంటీల బకాయిలు జిఎస్‌డిపిలో 35 శాతం లోపు మాత్రమే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది కూడా తదుపరి ఐదేళ్లలో 25 శాతానికి తగ్గించాలని నిర్ణయించారు. రాష్ట్రాలు సొంతంగా తయారు చేసుకునే గ్యారంటీ పాలసీలను కూడా కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు ఇచ్చే గ్యారంటీలు వాణిజ్యపరమైన వాటికి వర్తించకూడదన్న నిర్ణయాన్ని కూడా అనేక రాష్ట్రాలు ఆమోదించాయి. అలాగే ప్రయివేటు సంస్థలు, కంపెనీలకు గ్యారంటీలు ఇవ్వకూడదని కూడా ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. వివిధ పథకాల కోసం తీసుకునే రుణాల్లో 80 శాతానికి మాత్రమే గ్యారంటీలు ఇవ్వాలన్నది మరో నిర్ణయంగా కనిపిస్తోంది. గ్యారంటీల ద్వారా రుణాన్ని తీసుకున్న సంస్థల ఖాతాలను కూడా ఎప్పటికప్పుడు ప్రభుత్వం తరపున ఆడిట్ చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రం నుంచి సూచనలు

రాష్ట్రం నుంచి ఒక అంశంలో మాత్రం వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలిసింది. గ్యారంటీలను జిఎస్‌డిపిలో 10 శాతంగా వర్కింగ్ గ్రూప్‌లో నిర్ణయించగా, దానిని 12 శాతంగా మార్చాలని రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు సూచించారు. అలాగే ఐదేళ్లలో ఐదు శాతానికి తగ్గించాలన్న సూచనపై కూడా రాష్ట్రం స్పందిస్తూ దానిని పదేళ్లుగా మార్చాలని సూచించింది.



డిఆర్ఓ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె రమేష్‌నాయుడు

ప్రజాశక్తికి రక్తదాత అవార్డు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజాశక్తికి రక్తదాత అవార్డు లభించింది. విజయనగరం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ రక్తదాన దినోత్సవంలో డిఆర్ఓ గణపతిరావు ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ (స్టాఫ్ రిపోర్టర్) రమేష్ నాయుడుకు ఈ అవార్డును అందజేశారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యాన ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందుకుగాను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాత అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా డిఆర్ఓ గణపతిరావు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ ఈ పత్రిక కథనాలు రాస్తోందని కొనియాడారు. గిరిజన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్, సీతం ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ శశిభూషణరావు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో నారాయణ విజయ పరంపర!



హైదరాబాద్ : వైద్య విద్యా ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ -2023లో తమ విద్యార్థులు విజయ పరంపరను కొనసాగించారని నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా 10 లోపు 4 ర్యాంక్‌లు, 100 లోపు 35 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. శశాంక్ సిన్హా ఆలిండియా 4వ ర్యాంక్‌తో సంచలనం సృష్టించారన్నారు. తమ విద్యార్థులు 500 లోపు 112, 1000 లోపు 169 ర్యాంక్‌లు పొంది సరికొత్త రికార్డ్‌ను నెలకొల్పారన్నారు. విశిష్టమైన ప్రణాళికతో రూపొందించిన స్టార్ సిఒ బ్యాచ్, ఎన్ 40 ప్రోగ్రామ్ ద్వారా నిరంతరం టాప్ ర్యాంక్‌లు సాధిస్తున్నామన్నారు. సిబిఎస్ఇ సిలబస్ ఆధారంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కోసం అత్యంత వినూత్న విద్యా ప్రణాళిక వలనే ఈ టాప్ ర్యాంకులు సాధించగలిగామన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య సత్తా

ఆలిండియా టాప్ ర్యాంక్ కైవసం



టాప్ ర్యాంకర్స్‌తో శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్స్ సుష్మ, సీమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ 2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఆల్ ఇండియా టాపర్లుగా నిలిచి సత్తా చాటారు. తమ విద్యార్థి బోర వరుణ్ చక్రవర్తి ఆల్ ఇండియా స్థాయిలో 720కి 720 మార్కులను సాధించి ఓపెన్ కేటగిరీలో 1వ ర్యాంక్‌ను సాధించారని వెల్లడించింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ సుష్మ మాట్లాడుతూ.. యస్ వరుణ్ 715 మార్కులతో 9వ ర్యాంక్‌ను సాధించారన్నారు. శశాంక్ కుమార్ 14వ ర్యాంక్‌ను, రఘురామ్ రెడ్డి 15వ ర్యాంక్‌ను పొందారని వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 15లోపు 4, టాప్ 50లోపు 9, టాప్ 100లోపు 15 ర్యాంకులు, అలాగే వివిధ కేటగిరీల్లోనూ టాప్ 10లోపు 11, టాప్ 100 లోపు 79 ర్యాంకులు ఒక్క శ్రీచైతన్యనే సాధించిందన్నారు. 700 మార్కులు ఆపైన 54 మంది విద్యార్థులు పొందారన్నారు. ఇది శ్రీ చైతన్య ఆధిపత్యానికి నిదర్శనమన్నారు. అందువల్లే దేశ వ్యాప్తంగా నీట్ ప్రవేశాల కోసం విద్యార్థులు శ్రీచైతన్యను కోరుకుంటున్నారన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత బిఎస్ రావు అభినందనలు తెలిపారన్నారు.

స్టార్టప్‌ల నిధుల్లో 71 శాతం పతనం



న్యూఢిల్లీ : భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో సవాళ్లను చవి చూస్తున్నాయి. ప్రస్తుత ఏడాదిలో (జనవరి నుంచి మే) కాలంలో స్టార్టప్ సంస్థలకు సంబంధించి 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.41వేల కోట్లు)విలువ చేసే 461 ఒప్పందాలు జరిగాయని మార్కెట్ ఇంటిలిజెన్సీ వేదిక ట్రాక్సన్ వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలోని 17.1 బిలియన్ డాలర్ల (రూ.1.40 లక్షల కోట్లు) ఫండింగ్స్‌తో పోల్చితే 71 శాతం పతనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు టెక్నలాజీ ఉత్పత్తుల స్టార్టప్‌లు 1.6 బిలియన్ డాలర్ల (రూ.13వేల కోట్లు) నిధులను సమీకరించగలిగాయి. తర్వాత స్థానంలో ఫిన్‌టెక్ రంగం 1.4 బిలియన్ డాలర్ల (రూ.11.4 వేల కోట్లు) నిధులను పొందాయి. ముఖ్యంగా ఫోన్‌పే 850 మిలియన్ డాలర్ల సేకరణతో ఫిన్‌టెక్ రంగం అధిక నిధులను నమోదు చేసింది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న ఆర్థిక మందగమనం.. టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు దిగడం తదితర అంశాలు స్టార్టప్‌ల నిధుల సమీకరణలో ప్రతికూలతలను పెంచుతున్నాయి. గడిచిన ఏడాది 2022లో స్టార్టప్‌లకు ఫండ్స్ 33 శాతం తగ్గి 24 బిలియన్ డాలర్ల (రూ.1.95 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయయని పిడబ్ల్యుసి ఇండియా ఇటీవల ఓ రిపోర్టులో తెలిపింది. 2021లో ఈ సంస్థలు 35.2 బిలియన్ డాలర్ల (రూ.2.85 లక్షల కోట్లు)ను సమీకరించగలిగాయి. ఈ రంగంలో ఫండింగ్ తగ్గిపోవడంతో పాటు భారీగా ఉద్యోగాలు ఊడుతోన్న విషయం తెలిసిందే. స్టార్టప్‌లకు నిధుల మద్దతులో కేంద్ర ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించకపోవడం, బడా కార్పొరేట్లకు కొమ్ము కాయడం వల్లే అవి ఒత్తిడిలోకి జారుకుంటున్నాయని.. కొత్తవి రాలేకపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68